హైదరాబాద్ వార్త



## అవయవ దానం అవశ్యం




అవయవదానంపై నగరంలోని నెక్లెస్ రోడ్డులో మోహన్ ఫౌండేషన్ ప్రతినిధులు అవగాహన రన్ నిర్వహిస్తున్న దృశ్యం

## ముగ్ధమనోహరం కూచిపూడి రంగప్రవేశం

**రవీంద్రభారతి, ఆగస్టు 3 ప్రభాతవార్త :** ప్రఖ్యాత నాట్యగురువు పద్మశ్రీ శోభానాయుడు శిష్యురాలిగా పేరెన్నికగన్న యూనివర్శిటీ ఆఫ్ సిలికాన్ ఆంధ్ర నుండి కూచిపూడి నాట్యంలో మాస్టర్స్ డిగ్రీ అందుకున్న ప్రముఖ నాట్యగురువు, రెండుపర్యాయాలు గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్‌ను చేజిక్కించుకున్న నృత్యకళాకారిణి ప్రీతి తాటంభొట్ల శిష్యురాలు బిట్స్ పిలాని దుబై క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విద్యనభ్యసిస్తున్న శ్రీప్రణవి చింతలపూడి తన్మయి ఆర్ట్ స్టూడియో ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో కూచిపూడి రంగప్రవేశాన్ని ముగ్ధమనోహరం, రసభరితంగా ప్రదర్శించి విచ్చేసిన అశేష కళాప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను తన్మయుల్నిచేసి మంత్రముగ్ధులను కావించింది. శ్రీప్రణవి తన కూచిపూడి రంగప్రవేశాన్ని ముందుగా గౌళరాగం ఆదితాళంలో వాణిపరాకు ప్రణమామ్యహం అంశంతో ప్రారంభించి కృష్ణం కలయసఖి సుందరం; భామాకలాపం ప్రవేశదరువు; శ్రీ తాళ్లపాక మిగతా 3లో



కూచిపూడి రంగప్రవేశ నృత్య ప్రదర్శనలో హావభావాలను పలికిస్తున్న శ్రీప్రణవి

# నిరుపేదలకు సంజీవని

**హైదరాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ గాంధీ దవాఖాన అందిస్తున్న వైద్య సేవలతో కేవలం నిరుపేదలకే కాకుండా ధనికవర్గాలకు కూడా వరంగా మారింది. గతకొద్ది కాలంగా గాంధీ దవాఖాన ఏర్పాటు చేసుకున్న వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యుల కారణంగా గాంధీ దవాఖాన ఇప్పుడు కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా మాత్రమే కాకుండా అంతకు మించిన సేవలు అందిస్తూ కార్పొరేట్ ఆస్పత్రులకు కూడా ఆదర్శంగా తయారైంది. అనేక రోగాలకు సంబంధించి

**గాంధీలో కిడ్నీ వ్యాధులకు ఆధునిక వైద్యం**

**ఉచితంగానే కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్**

**జీవితకాలం ఉచితంగా మందులు**

**కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సదుపాయాలు**



కేసులను ఛాలెంజింగ్‌గా తీసుకొని ఇక్కడి వైద్యులు అత్భుతమైన వైద్య సేవలు అందించి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులనే తలదన్నే రీతిలో వైద్య సేవలు అందిస్తూ ఔరా అనిపిస్తున్నారు. ఒకప్పుడు గాంధీఆస్పత్రి అంటేనే మరణాలను చిరునామాగ భావించే ఆస్పత్రి నేడు కొన ఊపిరితో వచ్చిన వారికి కూడా సంజీవనిలా మారింది. కేవలం కొన్ని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులలో మాత్రమే లభించే ప్రత్యేక వైద్య సేవలు సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో ఇప్పుడు లభిస్తుండడం మిగతా 3లో



ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ పనుల కోసం భవనాలను కూల్చివేస్తున్న దృశ్యం

## కూల్చాల్సిన కట్టడాలు 520

**ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ పనులు వేగవంతం**

**ఇప్పటి వరకు కూల్చిన 380 ఆస్తులకు 360 కోట్ల పరిహారం**

**1100 నుండి 900 వరకు ప్రభావిత ఆస్తుల సంఖ్య కుదింపు**

**పిల్లర్ల ఏర్పాటుకు మార్కింగ్ పనులు ప్రారంభం**

**స్తంభాలు, స్టేషన్లు వచ్చే చోట భూసామర్థ్య పరీక్షలు**

**సమీక్షించిన మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి**

**హైదరాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** ఎంజీబీఎస్ నుండి చంద్రాయణగుట్ట మధ్య మెట్రో రైల్ కారిడార్ ఏర్పాటుకు సంబంధించిన రోడ్ విస్తరణ పనులు వేగవంతం అయ్యాయి. 7.5 కిలోమీటర్ల మార్గంలో అలైన్మెంట్ అద్భుతంగా ఉండేలా చర్యలు చేపట్టామని, ఈ మార్గంలో రోడ్ విస్తరణ వల్ల ప్రభావితం అయ్యే ఆస్తుల సంఖ్యను తగ్గించేలా మార్గాన్ని రూపకల్పన చేశామని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండి ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. మెట్రో పనులకు సంబంధించి ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులతో రోజు వారీ సమీక్షలు నిర్వహిస్తున్నామని అయన వెల్లడించారు. ముందనుకున్న అంచనా ప్రకారం 1100 ఆస్తులు ఈ విస్తరణలో కూల్చవలసి ఉంటుందని భావించామని, కానీ ఎలైన్మెంట్‌ను ఇంజనీరింగ్ నవకల్పన ద్వారా సరిదిద్దటం వల్ల ఆ సంఖ్య 900 వరకు తగ్గిందని ఆయన తెలిపారు. వీటిలో ఇప్పటికే 412 ఆస్తులకు సంబంధించిన అవార్డులు జారీ చేశామని, 380 ఆస్తుల కూల్చివేతలు ఇప్పటివరకు పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు. వీటి కోసం రు. 360 కోట్ల నష్టపరిహారం ప్రభావిత ఆస్తుల వారికి చెల్లించామని అన్నారు. ప్రభావిత ఆస్తులను స్వాధీనం చేసుకుంటూ, కూల్చివేతలు చేసి అవశేషాలను తొలగించడంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమించి పనులు ముమ్మరంగా చేపడుతున్నామని మెట్రో ఎండీ తెలిపారు. ఇక్కడ ఇళ్లు ఒకదానిని ఒకటి ఆనుకుని ఉండటం వల్ల, పైగా ప్రతి కట్టడానికి సంక్లిష్టమైన విద్యుత్ లైన్లు, ఇతర కేబుళ్ల వేలాడుతూ ఉండడంతో వాటిని చాలా అప్రమత్తంగా తొలగిస్తూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. సాధారణ జనజీవనానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అర్థరాత్రి సమయాల్లో విస్తరణ పనులు ముమ్మరంగా చేస్తున్నామని ఆయన చెప్పారు. మిగిలిన ఆస్తుల స్వాధీనానికి త్వరితగతిన కూల్చి వేతలు పూర్తిచేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు ఆయన వెల్లడించారు. మరో వైపు మెట్రో నిర్మాణ పనులు ప్రారంభించడానికి వీలుగా చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. ఈ కారిడార్‌లో వచ్చే పిల్లర్ల ఏర్పాటుకు తగిన స్థలాలను గుర్తించి వాటిని మార్కింగ్ చేసే పని ప్రారంభం అయిందని ఆయన తెలిపారు. వయాడక్ట్‌ను నిలిపే పిల్లర్ల మధ్య మిగతా 3లో

**విదేశీ వైన్**

# ఆ కిక్కే వేరబ్బా!

**నగరంలో పెరుగుతున్న ఇంపోర్టెడ్ లిక్కర్ మాల్స్**

**హైటెక్‌సిటీ, సికింద్రాబాద్, జూబ్లీహిల్స్ పరిసరాల్లో వెలిసిన దుకాణాలు**

**హంగు ఆర్భాటాలతో ప్రత్యేక ఆకర్షణ**

**ఒక్కో బాటిల్ ధర రూ.5వేల నుండి లక్ష**

**విదేశీ బీరుకూ యమ క్రేజ్**

**రూ.300నుంచి 500వరకు ధర**

**స్పెయిన్, బెల్జియం, ఇంగ్లాండ్, మెక్సికో నుంచి దిగుమతి**

**ఖరీదైనా వెనకాడని మద్యం ప్రియులు**

**శివారుల నుంచి సైతం పరుగులు**



**ఫారిన్ లిక్కర్ కిక్కు కోసం నగరంలోని మద్యం ప్రియులు తహ తహలాడుతున్నారు. దేశీయ మద్యం, విదేశీ మద్యం తయారీ ప్రక్రియలో వినియోగించే ముడి సరుకు మొత్తం ఒక్కటే అయినా.. విదేశీ మద్యంలో రుచి కోసం కొన్ని రాకాల సుగంధ ద్రవ్యాలు, ఫ్లేవర్స్ కలుపుతారు. దీంతో దాని రుచి, స్వభావం వేరుగా ఉంటుంది. విదేశీ మద్యం ప్యాకింగ్ కూడా భిన్నంగా ఉంటుంది. వీటి ధరలు చుక్కల్లో ఉన్నా మందు బాబులు ఆ కిక్కే వేరబ్బా అంటూ ఎగబడుతున్నారు. సంపన్న వర్గాలు ఉండే ప్రాంతాలను టార్గెట్ చేసుకుని దీనికి ఉన్న క్రేజ్‌ను వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.**

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** స్వదేశంలో విదేశీ మద్యానికి రోజురోజుకూ క్రేజ్ పెరిగిపోతున్నది. మద్యపాన ప్రియులు ఎంత ఖర్చయినా వెనకాడటం లేదు. ఆకర్షణీయమైన డిస్ప్లే, ఎయిర్ కండీషన్ దుకాణాలను ప్రారంభిస్తూ మద్యం ప్రియులను ఆకట్టుకుంటున్నారు. వాటిని చూడగానే అందులోకి వెళ్ళాలన్న ఆసక్తి ఉన్నా..అక్కడి మద్యం ధరలు చూస్తే మాత్రం కళ్లు తిరుగుతున్నాయి. దేశీ మద్యంతో విసుగెత్తి పోయిన వారంతా తాజాగా విదేశీ మద్యం కోసం పరుగులు పెడుతున్నారు. జంటనగరాల్లో విదేశీ మద్యం అమ్మకాలు భారీ ఎత్తున జరుగుతున్నాయి. సంపన్న వర్గాలు అధికంగా నివసించే ప్రాంతాల్లో వీటి దుకాణాలు పెద్దసంఖ్యలో వెలుస్తున్నాయి. సూపర్ మార్కెట్, షాపింగ్ మాల్ ్స మాదిరిగా 'ఇంపోర్టెడ్ లిక్కర్ మాల్స్ వెలుస్తున్నాయి. ఒక్కో బాటిల్ రూ.5వేల నుండి లక్ష రూపాయల వరకు ధర పలుకుతోంది. నగరంలో ఖరీదైన కిక్కును కోరుకునే వారికే ఇవి అదుబాటులో ఉంటున్నాయి. అయినా..విదేశీ మద్యం రుచి చూడాలనుకునే వారికి ఈధరలు పెద్దభారంగా కనిపించడం లేదు. అందుకే వీటికి మంచి క్రేజ్ పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

రోజురోజుకూ నగరవాసుల్లో విదేశీ మద్యం పట్ల క్రేజ్ పెరుగుతుండటంతో వీటి షాపులు కూడా భారీ ఎత్తున హంగూ ఆర్భాటాలతో వెలుస్తున్నాయి. హైటెక్‌సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, మియాపూర్, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, బంజారాహిల్ ్స, సికింద్రాబాద్ ప్రాంతాల్లో విదేశీ మద్యం దుకాణాలు వెలిశాయి. ఇందులో అనేకరకాల బ్రాండ్‌లు కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నాయి. విదేశీ మద్యంలో జానీవాకర్ ఎక్సో, జానీవాకర్, జానీవాకర్ ప్లైజర్, జానీవాకర్ బ్లూ, శివాస్‌లీగ్, జానీవాకర్ డబుల్‌బ్లాక్, గ్లెన్‌లీవిట్, గ్లెన్‌ఫిడిక్, మేక్‌లాన్, బెయిలీస్, జానీవాకర్ గోల్డ్ లేబుల్, రాయల్ సెల్యూట్, డాన్‌పెరి గ్నన్, చివాగ్ రీగల్, చివాగ్‌రీగల్ ఎక్స్‌ట్రా, రెడ్‌లేబుల్, డబుల్‌బ్లాక్, బ్లాక్ లేబుల్ వంటివి మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటని కొనడానికి కేవలం ఆప్రాంతాల్లోని వారే కాకుండా శివారు ప్రాంతానికి చెందిన మందుబాబులు కూడా విదేశీ మద ్యం కోసం నగరానికి తరలుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

విదేశీ బీర్లకూ డిమాండ్

విదేశీ బ్రాండ్లలో బీరుకు కూడా మంచి కేజ్రీ ఉంది. ఏకాలమైనా వీటికి డిమాండ్ ఉంటోంది. దేశీయ బీర్లకంటే విదేశీ బీర్‌ల ధరలు రెట్టింపుగా ఉన్నాయి. ప్రస్తుతం దేశీంగా లభించే బ్రాండ్ల బీరు ధరలు రూ.180నుండి 300 వరకు ఉన్నాయి. కాగా విదేశీ బీర్లు మాత్రం రూ.300నుండి 500వరకు పలుకుతున్నాయి. నగరానికి స్పెయిన్, బెల్జియం, ఇంగ్లాండ్, మెక్సికో దేశాల నుండి అధికంగా దిగుమతి అవుతున్నాయి. వీటి ధరలు ఎంతయినా విదేశీ బ్రాండ్‌ను రుచి చూడాలనుకునే వారికి ధరలు అడ్డుకావడం లేదని వ్యాపారులు తెలుపుతున్నారు.

దేశీయ మద్యం అనేది శుద్ధి చేయబడిన ఒక రకమైన స్పిరిట్ లేదా స్వేదనం. స్వదేశీ వైన్ తయారీదారులు దీనిని ఇంగ్లీష్ బ్రూయింగ్ కంపెనీలకు పంపుతారు. వారు దేశీయ కంపెనీల నుంచి తక్కువ ధరకు ఈ ద్రావణాన్నికొనుగోలు చేస్తారు. దేశీయ మద్యం, విదేశీ మద్యం తయారీ ప్రక్రియలో వినియోగించే ముడి సరుకు మొత్తం ఒక్కటే. కానీ విదేశీ మద్యంలో రుచి కోసం కొన్ని రాకాల సుగంధ ద్రవ్యాలు, ఫ్లేవర్స్ కలుపుతారు. దీంతో ఆ మద్యానికి రుచి, స్వభావం వేరుగా ఉంటుంది. అందుకే దీనికి ఎక్కువ ధర ఉంటుంది. విదేశీ మద్యం ప్యాకింగ్ కూడా భిన్నంగా ఉంటుంది. ఆల్కహాల్, స్కాచ్ లేదా ఫ్లేవర్ పెరుగుదలతో దాని ధర పెరుగుతుంది.



అధికారుల నుండి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి కోమటిరెడ్డి

## హైద్రాబాద్ నుంచి విజయవాడకు 2 గంటల్లో ప్రయాణం

**త్వరలో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మిస్తాం**

**చింతలకుంట ఎలివేటెడ్ కారిడర్ పనులు వేగవంతం**

**ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

**సైదాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ చింతలకుంట నుండి పెద్ద అంబర్‌పేట రేడియో స్టేషన్ వరకు నిర్మాణంలో ఉన్న ఎలివేటెడ్ కారిడర్ పనులను రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలసి వనస్థలిపురం జంక్షన్ వద్ద క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎలివేటెడ్ కారిడర్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే పనులు పూర్తి చేసి వాహనదారులకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దాదాపు రూ.650 కోట్ల మిగతా 3లో

## రూ. 10 లక్షల కోట్లకు చేనేత ఎగుమతులు

**అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ ఇచ్చేలా నైపుణ్యం పెంచుకోండి**

**జాతీయ చేనేత దినోత్సవ వేడుకలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**మాదాపూర్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** మాదాపూర్ శిల్పారామంలో 11వ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కిషన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిధిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ అడిషనల్ డైరెక్టర్ హ్యాండ్లూమ్స్ శ్రీనివాస్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ చేనేత రంగం దేశ ఆర్థికవ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తోందని, మోదీ మిగతా 3లో

**అడ్డ'గోలు'గా..**



## ట్రాఫిక్ నిబంధనలు పాటించటంలో వీడని నిర్లక్ష్యం

**కేవలం ఏడు నెలల్లోనే 45 లక్షలకు పైగా కేసులు**

**ఉల్లంఘనులకు చలానాలు 45.10 లక్షలు..**

**జరిమానాలు రూ.135.63 కోట్లు**

# రయ్..రయ్..రయ్

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** నగరంలో వాహనదారుల ఆగడాలకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది. పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా.. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి చర్యలు తీసుకుంటున్నా కొందరు వాహనదారుల్లో మార్పు రావడం లేదు. కేవలం 7 నెలల్లోనే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన నగర వాసుల సంఖ్య అక్షరాలా 45,10,550. వాటిపై జరిమానాలు రూ.135, 63,23,900. ట్రాఫిక్ పోలీసులు అధికరికంగా గుర్తించిన లెక్క ఇది. సీసీ కెమెరాలకు చిక్కని వారు అంతకు మించే ఉంటారని అంచనా. ముఖ్యంగా సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ రోడ్లపై వాహనాలను అడ్డదిడ్డంగా నడపడం వంటి చర్యలతో అనేకమంది వాహనదారులు ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నారు. గతేడాది మొదటి ఏడు నెలల్లో 60,16,290 నమోదవ్వగా, వాటితో పోల్చితే ఈ ఏడాది కాస్తా తక్కువగానే నమోదయ్యాయని ట్రాఫిక్ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. వీటిలో పోలీసులు నేరుగా విధించిన చలానాలు 8,08,535 కాగా, కెమెరాలకు చిక్కినవి 37,02,015గా ఉన్నాయి. ప్రధానంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు 2.91,770, విత్‌అవుట్ హెల్మెట్ 22,61,951, రాంగ్‌సైడ్ డ్రైవింగ్ 7,89,444, మైనర్ డ్రైవింగ్ 28,690, సిగ్నల్ జంపింగ్ 4,90,020, డ్రంకన్ డ్రైవ్ 1,53,025, నో పార్కింగ్ 30, 77,047, డేంజరస్ డ్రైవింగ్ 3,47,135, జిబ్రా లైన్ క్రాసింగ్ 14,79,090గా నమోదైనట్లు నగర ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే వెల్లడించారు. సైబరాబాద్ కమిషనరేట్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో నమోదైన ట్రాఫిక్ చలానాలు వీటికి అదనం.

**సిగ్నల్ జంపింగ్..**

ప్రమాదాలు సంభవించకుండా, వాహనదారుల్లో మిగతా 3లో

## 13న మహాగర్జనకు తరలిరండి

**నిజాంపేట్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** ఈనెల 13న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో విహెచ్పిఎస్, చేయూత పెన్షన్ దారుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జరుగు మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పిఎస్ మేడ్చల్ జిల్లా ఇన్చార్జ్ సూరిపాక వాసుదేవరావు మాదిగ, కోఇంచార్జ్ మునిరాతి అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగులకు రూ 6000, వృద్ధులు,


సమావేశంలో పాల్గొన్న నాయకులు

వితంతువులు ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులతో పాటు అన్ని రకాల చేయుత పెన్షన్లను రూ.4000 పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు. శనివారం బాచుపల్లి సాయినగర్‌లో మేడ సంజీవ మాదిగ అధ్వారంలో వృద్ధులు, వికలాంగులు, వితం తువులు ఇతర ఆసరా పెన్షన్ దారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా ఉపాధ్యక్షులు బాలనగర్ మండల్ ఇంచార్జ్ రాసమల్ల యాదగిరి మాదిగ, ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి కూకట్పల్లి మండల్ ఇంచార్జ్ సిల్వర్ శ్రీనివాస్ మాదిగ, భారాస, ఎన్ఎంసి ఆర్గనైజింగ్ సెక్రటరీ సంబశివా రెడ్డి, డేవిడ్, వెంకటయ్య, కృష్ణయ్య, రాజవర్ధన్ రెడ్డి, యూసఫ్, మణెమ్మ, ఎల్లమ్మ, లక్ష్మి ్మ, సోమయ్య, సుబ్బారాయుడు, రామయ్య వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


కూన శ్రీశైలం గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

**జీడిమెట్ల, ఆగస్ట్ 3, ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కి ఎండమూరి ఎం గ్రీనరీ వెల్ఫేర్ అసోసియేషన్, దేవభూమి నగర్, పిపి నగర్, చిత్తర్మ దేవి నగర్, నిజాంపేట్‌లోని పలు కాలనీవాసులు డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాల నుండి నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇక్కడి సమస్యను అతిత్వరగా పరిష్కరించటానికి కృషి చేస్తానని శ్రీశైలం గౌడ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయ కాలనీవాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంక్షేమా సంఘాల నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రోగుల బంధువులకు నిత్యం అల్పాహారం

**జీడిమెట్ల, ఆగస్టు 3, ప్రభాతవార్త :** దూర ప్రాంతాల నుండి హాస్పటల్లో చికిత్స పొందుతున్న రోగుల యోగక్షేమాలు చూసేందుకు వస్తున్న బంధువులకు నిత్యం అల్పాహారం అందిస్తున్న లైన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పర్యావరణ ప్రేమికులు కోలా రవీందర్ ముదిరాజ్ అన్నారు. సూరారంలోని నారాయణ హృదయాలయ, మల్లారెడ్డి హాస్పిటల్ ముందు నిత్యం అల్పాహారం అందిస్తున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు 8 గంటల నుంచి 8:30 లోపు అల్పాహారాన్ని అందిస్తున్నారని తెలిపారు.


అన్నదానం చేస్తున్న దృశ్యం

## కిడ్నాపర్ల చెర నుంచి బాలికకు విముక్తి

**కొంపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త :** కిడ్నాప్‌కు గురైన ఒడిస్సా బాలికను బాచుపల్లి పోలీసులు గుర్తించి ఆమెను కిడ్నాపర్ల నుండి కాపాడారు. శనివారం రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో ఒడిస్సా రాష్ట్రం కటక్‌లో గల సౌత్ ఆసియా ఉమెన్ ఫౌండేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ తన్వి సింగ్ ఫోన్ ద్వారా బాచుపల్లి పోలీస్ ఇన్స్పెక్టర్ సి.సతీష్ కుమార్‌కు బాలిక కిడ్నాప్ విషయమై సమాచారం అందింది. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్‌లో బాలికను బంధించి ఉంచినట్లు ఫిర్యాదు వచ్చింది. దీంతో బాచుపల్లి పోలీసులు తమ పరిచయాలను, స్థానిక ప్రజల మద్దతును పొంది ఇందిరా గాంధీ నగర్‌లోని అనుమానిత ఇళ్లల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి ఎట్టకేలకు బాలికను గుర్తించి, ఆమెను కాపాడారు. పోలీసులకు బాలిక ఫోటో, ఫోన్ నెంబర్ మాత్రమే పోలీసులకు అందింది. దీని ఆధారంగా పోలీసులు రాత్రి వేళల్లో విస్తృతమైన గాలింపులు చేపట్టి బాలికను కాపాడారు. బాలిక తల్లిదండ్రులకు, ఒడిస్సా పోలీసులకు అప్పగించే వరకు బాలికను సురక్షి త కస్టడీ కోసం సూరారంలోని బాలికల సఖి కేంద్రానికి తరలించినట్లు బాచుపల్లి ఎస్ హెచ్ ఓ సతీష్ కుమార్ తెలిపారు.



## ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు

**ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**కొంపల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త :** కొంపల్లి మున్సిపాలిటీ పరిధి సినీ ప్లానెట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్వేతా శుభం అపార్ట్మెంట్స్ ముఖద్వారంను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సంద ర్భంగా కార్యక్రమం శుభసూ చకంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా చెట్టును నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని కాలనీలలో భూగర్భ డ్రైనేజీ, రోడ్డు, తాగునీటి సదుపాయాలను కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, శ్వేతా శుభం సొసైటీ చైర్మన్ సృజన్ రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుమన్ గార్లపాటి, కోశాధికారి శివారెడ్డి, డైరెక్టర్లు, అపార్ట్మెంట్ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## దైవచింతనతో మానసిక ప్రశాంతత

**దుండిగల్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** దుండిగల్ పురపాలిక పరిధి భౌరంపేట ఇందిరమ్మకాలనీలోని నాగుల ఎల్లమ్మ తల్లి ఆలయంలో శ్రావణమాస బోనాల పండుగ వేడుకల్లో మేడ్చల్‌జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈసందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు నిర్వంచిన అనంతరం మాట్లాడుతూ బోనాల వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీకౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, నాయకులు మురళీయాదవ్, బుచ్చిరెడ్డి, దర్శన్‌రెడ్డి, ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

# అవయవదానంపై అవగాహన రన్

### విజేతలకు మెడల్స్ అందించిన ఎంపీ ఈటెల

**బేగంపేట ఆగస్టు 3.ప్రభాతవార్త :** ప్రపంచ అవయవదానం దినోత్సవాన్ని పురస్కరించుకొని అవయదానం గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆదివారం నెక్లెస్ రోడ్డులోని సంజీవయ్య పార్కువద్ద తెలంగాణ 10కె రన్ రన్ ఫర్ ఆర్గన్ డోనేషన్ 3వ ఎడిషన్ ఉత్సాహభరితంగా జరిగింది. మోహన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్లోబల్ ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, నిప్పాన్ ఎక్స్‌ప్రెస్ సంయుక్తంగా నిర్వహించిన 5కే,10కే విభాగాల్లో నిర్వహించిన ఈ రన్‌లో రెండు వేల మందికి పైగా రన్నర్స్, సాధారణ పౌరులు పాల్గొన్నారు. ఈ రన్‌ను బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌత్ జనరల్ మేనేజర్ మనోజ్‌కుమార్ శ్రీవాస్తవ, మోహన్ ఫౌండేషన్ సీఈఓ రఘురాంలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ విజేతలకు మెడల్స్‌ను అందజేసారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ మనిషి జీవితం తర్వాత మరో జీవితాన్ని ఇవ్వగల అవయవదానం పట్ల అందరిలో అవగాహన పెరగాలన్నారు. ఇందుకోసం మోహన్ ఫౌండేషన్ చేస్తున్న కృషిని ఈటెల అభినందించారు. అవయవ దానం ద్వారా మారిన జీవితాల కథలు ఎంతో స్ఫూర్తిదాయకమని, మోహన్ ఫౌండేషన్ ఇదే దిశగా నిరంతరం కృషి చేస్తుందని మోహన్ ఫౌండేషన్ సీఈఓ రఘురాం అన్నారు. అలాగే మ్యాక్స్ ప్రోటీన్, డా.రెడ్డీస్, మేఘవి వెల్నెస్ స్పా,బాడీ ఆర్మరైట్ ,బెన్‌ఫిక్,జోఆర్మీ,వాక్‌ఫిట్ , హైఫైవ్, ట్రైబ్.జర్మటీన్ హాస్పిటల్స్, వివిఎస్ఎం ఎంటర్‌టైన్‌మెంట్స్, డెకథ్లాన్ సికింద్రాబాద్, తాజ్‌హోటల్స్, స్నాప్ వెల్డ్, మూవ్ మెంటిజం,కార్నిటోస్,అక్షయకల్ప,అంపుల్ రీచ్,ప్లాషిఫై.ఆల్కలైన్, వర్క్ఇండియా, గ్రీన్ మాటర్ తదితర సంస్థలు భాగస్వాములుగా వ్యవహరించాయి.


సంజీవయ్య పార్కు వద్ద రన్‌ఫర్ ఆర్గన్ డోనేషన్ ర్యాలీ దృశ్యం

## ప్లాట్ల యజమానులకు న్యాయం చేయండి

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 3, ప్రభాతవార్త :** చట్టబద్దమైన యాజమాన్యం ఉన్న జీహెచ్ఎంసీ అనుమతుల నిరాకరణ, వేదింపులు, భూ అక్రమాలు జరుగుతున్నాయని భాగ్యనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం వివేకానంద్‌నగర్ కాలనీ ఆనుకుని ఉన్న సర్వేనెంబర్ 1007లోని 1400 చట్టబద్ధమైన ప్లాట్ల యజమానులు తమకు న్యాయం చేయాలంటూ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. భాగ్యనగర్ కోఆపరేటివ్ సొసైటీ దాదాపు 3 దశాబ్దాల క్రితం సర్వే నంబర్ 1007లో 167 ఎకరాలను కొనుగోలు చేసి అందులో ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు ప్రొఫెసనల్స్, వ్యాపారవేత్తలతో కలిసి 1400 మంది సభ్యులకు ప్లాట్లను కేటాయించటం జరిగింది. అయితే కోర్టు పర్యవేక్షణలో పలు సేల్ డీడీల ద్వారా రిజిస్ట్రేషన్లు, చట్టబద్దంగా పూర్తి చేసుకున్నారు. అందులో ప్లాట్లతో పాటు విద్యుత్ కనెక్షన్లు ఉన్నప్పటికీ ప్లాట్ల యజమానులకు నిత్యం వేదింపులు తప్పటం లేదని జీహెచ్ఎంసీ నుంచి భవన నిర్మాణాకలు అనుమతులు నిరాకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ కార్పొరేటర్ ప్రయోజనాలతో ఉన్న కొంతమంది నకిలీ పత్రాలతో తప్పుడు యాజమాన్య హక్కులను చూపిస్తూ తమను వేదింపులకు గురిచేస్తున్నారన్నారు. వెంటనే అధికారులు తమ సమస్యలను దృష్టిలో ఉంచుకుని 30 ఏళ్లకు పైగా ఎదురుచూస్తున్న ప్లాట్ల యజమానులకు ఇళ్లు కట్టుకునే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

## ప్రతిఒక్కరు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఆరోగ్యం పట్ల ప్రజలు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలని అల్లాపూర్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని గాయిత్రినగర్‌లో రాక్ గార్డెన్ పార్క్‌లో పార్థివ్ లంగ్‌కేర్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. దాదాపు 250 మంది వరకు స్థానికులు వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఎండీ నాగరాజు, డాక్టర్ రాధ, డాక్టర్ మౌనికా, గాయిత్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారావు, మాజీ అధ్యక్షులు సంజీవరెడ్డి, జితేందర్, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


గాయిత్రినగర్‌లో ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్.

## తోట సంక్షేమ సంఘం నేతకు పరామర్శ

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 03, ప్రభాతవార్త :** మోతీనగర్ ప్రాంతంలోని అవంతినగర్ తోట సంక్షేమ సంఘం అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు సతీమణి విజయలక్ష్మి గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గం శాసనసభ్యులు మాదవరం కృష్ణారావు, ఆంధ్రప్రదేశ్ నంద్యాల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రారెడ్డి, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్, కార్పొరేటర్ మహేందర్‌లు వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ, సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, చిన్న అబ్బులుతో పాటు వివిధ పార్టీల నాయకులు, సంక్షేమ సంఘం ప్రతినిధులు వివిధ కాలనీల, బస్తీల అధ్యక్షులు విజయలక్ష్మి పార్థిదేహానికి నివాళులర్పించి కుటుంటాన్ని పరామర్శించారు.


వైద్యపరీక్షలు నిర్వహించుకుంటున్న స్థానికులు

## ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

**దుండిగల్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** దుండిగల్ పురపాలిక పరిధి దుండిగల్ డబుల్‌బెడూరూమ్ ఇండ్ల సముదాయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ కావలి గణేష్, ఆకుల ప్రేమ్‌పటేల్ ఆధ్వర్యంలో మెడ్‌విజన్ వైద్యశాల సౌజన్యంతో నిర్వహించిన మెగా ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యశిబిరంలో ఇసిజి, రక్త, దంత తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 500కు పైగా స్థానికులు వైద్యశిబిరాన్ని వినియోగించుకున్నారు. కావలి గణేష్ మాట్లాడుతూ పేదప్రజలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుకూడదనే ఉద్దేశ్యంతో ఇటువంటి ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. సహాకరించిన మెడివిజన్ వైద్యశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజి ఎంపిపి చిన్నంగి వెంకటేష్‌ముదిరాజ్, మున్సిపల్ అధ్యక్షులు నవీన్‌రెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్‌రెడ్డి, శ్రీశైలంముదిరాజ్, గోపాల్‌యాదవ్, శ్రీనివాస్, నరేందర్‌ముదిరాజ్, అజయ్, సాయి, యశ్వంత్, నవీన్‌గౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

## తెలంగాణ రతనాలు పుస్తకావిష్కరణ

**నాంపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త :** దేవులపల్లి ప్రభాకరరావు రచించిప గాంధీవనం. చెప్పుకోదగ్గ మనుషులు, పాతికేళి ఇత్యాదులు ఆయన ప్రతిభాపాటవాలను వ్యక్తపరిచే గొప్ప రచనలని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, ఐఎస్ విశ్రాంత అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. శ్రీకృష్ణదేవరాయ భాషానిలయంలోని రావిచెట్టు రంగారావు కళావేదికలో ప్రముఖ రచయిత, కాలమిస్టు, అనువాదకుడు, తెలంగాణ అధికార భాషా సంఘం తొలి అధ్యక్షుడు దేవులపల్లి ప్రభాకరరావు రచించిన తెలంగాణ రతనాలు గ్రంథాన్ని ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి ఆదివారం ఉదయం ఆవిష్కరించి ఆయనకు ఘననివాళులర్పించారు. 89మంది తెలంగాణ ప్రముఖుల జీవిత చరిత్రకు సంబంధించిన వ్యాసాలను భాషానిలయం గౌరవాధ్యక్షుడు టి.ఉదయవర్లు తెలుగు భాషానిలయం తరపున సంకీకరించగా ఉపాధ్యక్షుడు కె.చంద్రప్రకాశరావు నేతృత్వంలో భాషానిలయం ఈ గ్రంథాన్ని ప్రచురించింది. అనంతరం రమణాచారి కె.చంద్రప్రకాశరావును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాషా నిలయం గౌరవాధ్యక్షుడు టి.ఉదయవర్లు, సభ్యులు జి.నరసింహమూర్తి, కె.జగదీశ్వర్‌రావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో మళ్లీ మనమే గెలవాలి

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 3, ప్రభాతవార్త :** ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ చేసిన మంచి పనులను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్ గూడ డివిజన్‌కు చెందిన బూతు స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశానికి హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు సర్గీయ మాగంటి గోపానాథ్ సతీమణి మాగంటి సునీతా గోపీనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపినాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ మాగంటి గోపీనాథ్ చేసిన సేవలకు నివాళిగా మరోసారి జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యకార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ చేసిన మంచి పనులను ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ రేవంత్‌రెడ్డి అసమర్థ పాలనతో విసిగిపోయిన అన్ని వర్గాలను కలుపుకుని పోవాలని సూచించారు. 20 నెలల కాంగ్రెస్ మోసాన్ని చూసిన తర్వాత కూడా కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అన్ని సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నారు. కాంగ్రెస్, బీజేపీల ఏకైక ఎజెండా తెలంగాణ రాష్ట్రసమితిని ఓడించటమేనని అందుకే ఈ రెండు పార్టీలు కలిసి తెలంగాణలో కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ హోంమంత్రి మహ్మూద్ అలీ, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దాసోజు శ్రావణ్, అబ్దుల్ సోహెల్, యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, వెంగళ్‌రావునగర్ కార్పొరేటర్ దేదిప్య విజయ్‌కుమార్, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేష్‌తో పాటు పెద్దఎత్తున నాయకుల కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

## ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపులో అవకతవకలు అరికట్టాలి

**హైదరాబాద్ ఆగస్టు 3 ప్రభాతవార్త:** ఇంజినీరింగ్ సీట్ల కేటాయిం పులో జరిగిన అవకతవక లను తక్షణం అరికట్టాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. 2025-26 సంవత్సరానికి కి చేపట్టిన సీట్ల కేటాయింపులో.. రిజర్వేషన్ల వారీగా పారదర్శకత లోపించిందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం విద్యానగర్ లో నిరసన ప్రద ర్శన చేపట్టి మాట్లాడారు. ఇంజినీరింగ్ కన్వీనర్ కోటా సీట్లలో అమ్మాయిల స్థానంలో అబ్బాయిలకు సీట్లు కేటాయిస్తున్నారని మండిపడ్డారు. ఓపెన్ కేటగిరి విధానంలోనూ ఇదేతరహాలో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యా శాఖకు మంత్రి లేకపోవడంతో సంబంధిత వ్యవస్థ గందరగోళంగా తయారైందని. ఫీజుల పెంపుపై అధికారులకు ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్తుపై లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళ నలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థి నేతలు చంద్రశేఖర్ గౌడ్, ప్రవీణ్, రాహుల్, వినయ్, అర్జున్, సురేందర్, ప్రభు, జగదీశ్ పాల్గొన్నారు.


నిరసన ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

## లింగోజిగూడ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి : కార్పొరేటర్

**సైదాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ సమగ్రాభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నామని జిహెచ్ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని న్యూ శివపురి కాలనీలో రూ.47 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లు, రూ.15లక్షలతో యుజిడి ఆధునీకీకరణ పనులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో మౌళిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. సిఎం రోడ్డు విస్తరణకు ప్రజలందరు సహకరించాలని కార్పొరేటర్ కోరారు. రాజకీయాలకు అతీతంగా డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ శివపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మారగోని రాజేష్‌గౌడ్, సురేష్ రాజు, మధుసూధన్‌చారి, వెంకటేశ్వర్లు, నరేష్ కుమార్, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం ధర్మకర్త విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్, పి.శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, కరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 24న పాతబస్తీలో మొహర్రం ఊరేగింపు: సయ్యద్ దిల్దార్ హుస్సేన్ అబేది

**చార్మినార్, ఆగస్టు 3 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో ఆగస్టు నెల 24వ తేదీన మొహర్రం చివరి ఆదివారం సందంగా ఊరేగింపు నిర్వహించనున్నా మని దిల్దార్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు మౌలానా సయ్యద్ దిల్దార్ హుస్సేన్ అబేది తెలిపారు. ఆమన్‌నగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ ఆగష్టు నెల 24వ తేదీన ఊరేగింపు జరుగుతుందని,ఆదివారం ఉదయం 10 గంటలకు యాకుత్‌పుర నుంచి ఊరేగింపు ప్రారంభమై పలు ప్రాంతాలు మీదుగా కొనసాగిన అనంతరం అసుర్‌ఖానా హజ్రత్ ఖయామ్ ఆమన్‌నగర్ కట్ట వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌలానా డాక్టర్ సయ్యద్ నిసార్ హుస్సేన్ హైదర్ అకా సాహిబ్ ఖిబ్లాతో పాటు పలు ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరవుతున్నారని ఆయన తెలియజేశారు. ఊరేగింపులో వేలాది మంది పాల్గొంటున్నారని దిల్దార్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు మౌలానా సయ్యద్ దిల్దార్ అబేది తెలిపారు. విలేకర్ల సమావేశంలో అంజుమన్ గుల్షన్ అధ్యక్షులు మీర్ హాది అలీతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అలరించిన శివభక్త మార్కండేయ నృత్యరూపకం

**రవీంద్రభారతి, ఆగస్టు 3 ప్రభాతవార్త :** ప్రముఖ సాంస్కృతిక సంస్థ నృత్యకిన్నెర 42వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, నృత్యకిన్నెర సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రఖ్యాత నాట్యగురువు, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార, హంస అవార్డు గ్రహీత డా. మద్దాళి ఉషాగాయత్రి శిష్యబృందంచే ప్రదర్శింప బడిన శివభక్త మార్కండేయ కూచిపూడి నృత్యరూపకం ఆధ్యాత్మిక శోభను వెదజల్లుతు ప్రేక్షకులను భక్తిమార్గంలో పయనింపజేసింది. శ్రావణమాస పర్వదినోత్సవాల ప్రాధాన్యతను కలబోసి ప్రదర్శింప బడిన ఈ కూచిపూడి నృత్యరూపకంలో ప్రధాన పాత్రలో కళాకారులు ఆశ్రిత శివుడుగా, వాసవి చౌదరి పార్వతి, చరిశ్య మార్కండేయ, మాధవి ముకుంద, వాణి భవాని మారుద్వతి, రమ్యవేణి యమున, శ్వాతి చిత్రగుప్త, శ్రద్ధ నారదముని, సుప్రియ అప్పరసగా, శోభన, లాస్యప్రియలు మార్కండేయ స్నేహితులుగా, ఇందుప్రియ, ఆధిత్యలు యమకింకరులు అద్భుతంగా నటించడగా, నాట్యకారిణులుగా లక్ష్మి, కాశ్వి, దీక్షిత, భవాని, లలితశ్రీ, ఆశ్రిత, నిత్యలు తమ నాట్యంతో అలరించారు. గురు పశుమర్తి శేషబాబు నట్టువాంగం-గాత్రం; వెంపటి శర్మ గాత్రం; శ్రీధరాచార్య మృదంగం; కె.అనిల్‌కుమార్ వయోలిన్; వెంకటేష్ వేణువులతో అద్భుత వాద్యసహకారం అందించి శివభక్త మార్కండేయ కూచిపూడి నృత్యరూపకాన్ని మరింత రక్తికట్టించి ప్రేక్షకుల హర్షద్వానాల మధ్య శుభాశీస్సులు, ప్రశంసలు అందుకున్నారు.


శివభక్త మార్కండేయ కూచిపూడి నృత్యరూపకంలో ఒక దృశ్యం

### పలువురికి దళిత రత్న అవార్డుల ప్రదానం

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 3, ప్రభాతవార్త :** యూనియన్ బ్యాంక్ హైదర్‌నగర్ బ్రాంచ్ మేనేజర్ ఎర్రుల శ్రవణ్ కుమార్, ఐసిఐసిఐ బ్యాంకు హౌసింగ్ ఫైనాన్స్ ఇన్చార్జి బేగరి నర్సింహులకు తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ, డా.బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రాం జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజు మాదిగ ఆదివారం దళిత రత్న అవార్డులను ప్రదానం చేశారు. ఉద్యోగం చేస్తూ తాము పద్ద కష్టాలను తోటి దళితులు పడకూడదని తమ వంతు సహాయం చేస్తున్నా ఎర్రుల శ్రవణ్ కుమార్, బేగరి నర్సింహా ఆదర్శ వంతులని ఇటుక రాజు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నపారి చంద్రశేఖర్, కుసుమ భోగరాజు, కల్వగూరి శ్రీనివాస్, కొండూరి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వడ్డేపల్లి సేవలు స్ఫూర్తిదాయకం

**కెపిహెచ్బి కాలనీ, ఆగస్టు 3 ప్రభాతవార్త :** శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి సన్నిధిలో పల్నాటి బ్రహ్మనాయుడు బ్లాక్ బి భోజనశాల వద్ద సంఘం వ్యవస్థాపకులు దివంగత నేత స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు కాంస్య విగ్రహాన్ని ఘనంగా ఆదివారం ఆవిష్కరించారు. ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ అధ్యక్షులు పాపరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త కురుమయ్య గారి కొండల్ రావు, వడ్డేపల్లి నరసింహారావు కుమారుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కోరుట్ల శాసనసభ సభ్యులు సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ కురుమయ్య గారి నవీన్ రావు, బల్మూర్ వెంకట్, నాయినేని సూర్యారావు, గొట్టిముక్కుల వెంకట్రావు, జూపల్లి సత్యనారాయణ, కురుమయ్యగారి సుదర్శన్ రావు, గోనే శ్రీనివాస్ రావు రామాంజనేయులు, పొన్నాల రామచంద్ర రావు, వెంగల్ రావు, కూకట్‌పల్లి వాసులు ఆల్ ఇండియా వెలమా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. నర్సింగ్ రావు సమాజ సేవతో దార్శనిక నాయకుడిగా గుర్తింపు పొందారని వక్తలు కొనియాడారు. వెలమకుల అభ్యున్నతికి, హక్కుల కోసం జీవితాంతం పాటుపడ్డ గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన చూపిన మార్గం యువతకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.


నర్సింగరావు ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

## ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా కృషి

**కెపిహెచ్బి కాలనీ, ఆగస్టు 3, ప్రభాతవార్త :** ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ అందేలా కృషి చేస్తానని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో ఆదివారం పాదయాత్ర చేసి కాలనీ వాసులతో మాట్లాడి కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు అందుతున్నాయో లేదో అని కాలనీ మహిళలను, చిరు వ్యాపారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జి.రవి, అగ్రవాసు, గోపాల్, రవీందర్, మహేష్, శివ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులు అందజేస్తున్న కార్పొరేటర్ దొడ్ల

## నృత్య ప్రదర్శన విజేతలకు సత్కారం

**కెపిహెచ్బి కాలనీ, ఆగస్టు 3, ప్రభాతవార్త :** కేరళ రాష్ట్రంలో నిర్వహించిన అఖిలభారత కూచిపూడి నృత్య ప్రదర్శనలో మానస స్కూల్ ఆఫ్ డాన్స్ గురువు కుమారి ప్రణవితో పాటు వారి బృందం బహుమతులు గెలుచుకొని తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకొచ్చిన సందర్భంగా కూకట్ పల్లి అయ్యప్ప స్వామి దేవస్థాన ప్రాంగణంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, అయ్యప్ప స్వామి ఆలయ ఇంచార్జ్ సుదర్శన్ రావు విచ్చేశారు. కుమారి ప్రణవి వారి శిష్య బృందాన్ని వడ్డేపల్లి రాజేశ్వరరావు అభినందించి సన్మానించారు.


కుమారి ప్రణవి వారి శిష్య బృందానికి సన్మానం చేస్తున్న రాజేశ్వరరావు

## నల్ల పోచమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**హైదరాబాద్, ఆగస్ట్ 3, ప్రభాతవార్త:** కాచిగూడ డివిజన్ నెహ్రూనగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలలో అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆదివారం ఉదయం ఎమ్మెల్యే సతీమణి కాలేరు పద్మతో కలసి దేవాలయానికి వచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు


ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే వెంకటేష్ దంపతులు

## శివాలయం భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

**సైఫాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** తప్పుడు పత్రాలను సృష్టించి 4 శతాబ్దాల నాటి శివాలయం భూమిని కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది సురేష్‌బాబు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తారామత్‌పేట గ్రామంలో సర్వే నెంబరు 113 నుంచి 116, 134 నుంచి 140, 155 నుంచి 157, 242 నుంచి 245లోగల 100 ఎకరాల భూమి రజని అలియాస్ విజయలక్ష్మి, తల్లి కొరకొక్కుల భూలక్ష్మిలకు పూర్వికుల నుంచి సంక్రమించిందని చెప్పారు. శివాలయంకు రజని పూర్వికులు కానుకగా ఇచ్చారని, ఈ భూమిపై పలు కోర్టులలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇటీవల భూమి రేట్లు పెరగడంతో భూకబ్జాదారులు కన్నేసి తప్పుడు పత్రాలను సృష్టించి కబ్జా చేశారని ఆరోపించారు. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని శివాలయంకు చెందిన 100 ఎకరాల భూమిని స్వాదీనం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న రజని భూమికి సంబంధించిన ఆధారాలను ప్రదర్శించారు.


సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

## మద్యపాన నిషేదం కోరుతూ 14న ఆటోల బంద్

**సైఫాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యంకు బదులుగా రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్యపాన నిషేదాన్ని అమలు చేయాలని ఎన్టీఆర్ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జెఏసి డిమాండ్ చేసింది. సంపూర్ణ మద్య పాన నిషేదం కోసం ఈ నెల 14న నగరంలో ఒక రోజు ఆటో బంద్ నిర్వహిస్తున్నామని జెఏసి రాష్ట్ర కన్వీనర్ ఎండి అమానుల్లాఖాన్ తెలిపారు. ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

### వచ్చేనెల 1న రాష్ట్ర ప్రభుత్వానికి మాదిగల కృతజ్ఞత సభ

**సైఫాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టం చేసి అమలుకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ సెప్టెంబరు 1న రవీంద్రభారతిలో 'మాదిగల కృతజ్ఞత సభ'ను నిర్వహిస్తున్నామని ఆల్ ఇండియా ఎంఆర్‌పిఎస్ తెలిపింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య ఈ విషయాన్ని వెల్లడించారు.

## రూ.10 లక్షల కోట్లకు చేనేత ఎగుమతులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం దీనికి పెద్దపీట వేస్తోందని అన్నారు. 2015లో ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రకటించారని, అప్పటినుంచి ప్రతి సంవత్సరం ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నమన్నారు. వ్యవసాయ రంగం తర్వాత ఉపాధి కల్పించే రంగంగా చేనేత పరిశ్రమ నిలుస్తోందన్నారు. 5 కోట్ల మంది ప్రజలు చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని ఆయన తెలిపారు. అనేక విమానాశ్రయాలు, షాపింగ్ మాల్స్‌లో దేశీయ పట్టు చీరలు, చేనేత వస్తువులు ప్రదర్శించబడుతున్నాయని, దేశ జీడీపీలో చేనేత రంగం వాటా ప్రస్తుతం 2.3. దీన్ని 5 వరకు పెంచే లక్ష ్యంతో మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రస్తుతం రూ. 3 లక్షల కోట్ల విలువైన చేనేత ఉత్పత్తులు ఎగుమతవుతున్నాయన్నారు. ఈ సంఖ్యను రూ. 10 లక్షల కోట్లకు పెంచే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశంలో తయారయ్యే ఉత్పత్తులపై ప్రజలు గర్వంగా ఉండాలని, మేడ్ ఇన్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు టెక్స్‌టైల్ పార్కు మంజూరు చేసినట్లు తెలిపారు. నైపుణ్యం కలిగిన చేనేత కార్మికులు ఉన్నట్లయితే మాత్రమే అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ ఇవ్వగలమని అన్నారు. కార్మికులు తాము చేసే పనిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, రానున్న రెండు మూడు నెలల్లో ఈ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి పలు సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారని తెలిపారు.

## ..విజయవాడ రెండు గంటల్లో ప్రయాణం

(మొదటిపేజీ తరువాయి)

వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఎలివేటెడ్ కారిడర్‌లో కింద భాగంలో రోడ్డు, మధ్యలో హైవే, పైన మెట్రో వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దీని గురించి ఈ నెల 6వ తేదీన కేంద్రమంత్రి గడ్కరీని కలవనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందుల గురించి తనకు తెలుసని, ఎంపిగా ఉన్నప్పుడే ఇక్కడి రోడ్ల అభివృద్ధికి కృషి చేశానని అన్నారు. ఎలివేటెడ్ కారిడర్ పనుల గురించి మల్‌రెడ్డి రాంరెడ్డి ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువస్తున్నారని అన్నారు. హైద్రాబాద్ నుండి విజయవాడకు రెండు గంటల్లో చేరుకునేలా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం చేయబోతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ నెల రోజుల క్రితమే స్థానికులతో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలవడం జరిగిందన్నారు. వెహికిల్ అండర్ పాస్‌లకు బదులుగా ఫ్లై ఓవర్‌లు నిర్మించాలని, ప్రజలు సులభంగా రోడ్లు దాటేలా ఫ్లై ఓవర్‌లు నిర్మించాలని మంత్రికి వినతిపత్రం అందజేయగా, తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఇఇ ధర్మారెడ్డి, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఇంకా కూల్చాల్సిన కట్టడాలు 520

(మొదటిపేజీ తరువాయి)

25 మీటర్ల (సుమారు 82 అడుగులు) దూరం ఉంటుందని ఆయన చెప్పారు. మెట్రో స్తంభాలు, స్టేషన్లు వచ్చే చోట భూసామర్థ్య పరీక్షల కోసం ఏజెన్సీని నియమించామని, త్వరలో భూసామర్థ్య పరీక్షలు కూడా చేపడతామని ఆయన వెల్లడించారు. చారిత్రక మరియు ఇతర సున్నిత కట్టడాలకు అంతరాయం కలగకుండా, పిల్లర్ మరియు మెట్రో స్టేషన్ల స్థానం నిర్ణయించేందుకు డిజిపిఎస్ సర్వే నిర్వహించామని ఆయన తెలిపారు. నిర్మాణ సమయంలో సర్వే సులభంగా జరిగేలా భూమిపై తాత్కాలిక బెంచ్ మార్క్ (టిబిఎస్) లొకేషన్లు నిర్ణయించినట్టు ఆయన స్పష్టం చేశారు. పిల్లర్లు, స్టేషన్లు వచ్చే ప్రాంతాల్లో భూగర్భ మురుగునీటి లైన్లు, మంచినీటి లైన్లు, వరదనీటి డ్రైన్లు, పైన వేలాడే విద్యుత్ లైన్లు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశానుసారం విద్యుత్ లైన్లను అండర్ గ్రౌండ్ లేబుల్లుగా మారుస్తామని తెలిపారు. ఇందుకోసం వాటర్ బోర్డు, జీహెచ్ఎంసీ, టీజీఎస్పీడీసీఎల్ విభాగాల నుండి వచ్చే కొద్ది రోజుల్లో అంచనాలు సమర్పించవలసిందిగా కోరామని ఆయన చెప్పారు. ఆయా శాఖల అధికారులతో మెట్రో అధికారులు రేయింబవళ్లు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షి స్తూ ముఖ్యమైన యుటిలిటీస్‌ని గుర్తించే పని చేపట్టారని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు.

## నిరుపేదలకు సంజీవని

(మొదటిపేజీ తరువాయి)

గమనార్హం. కొన్ని లక్షలు వెచ్చించి ప్రైవేట్ ఆస్పత్రులలో పొందే వైద్యం గాంధీ ఆస్పత్రిలో ఉచితంగా అందించడం దేవుడిచ్చిన వరంలాంటిదే. ఇక్కడి వైద్యులు కూడా ఏ ఒక్కరిని రోగిలా కాకుండా వారి కుటుంబ సభ్యులకు రోగాలు వస్తే ఎలా స్పందిస్తారో రోగుల విషయంలో కూడా అలాగే స్పందిస్తారు. గతంలో పెద్దవారిది ఎవరో ఒకరిది రికమెండేషన్ చేయిస్తే నాణ్యమైన వైద్యం అందుతుందని ఎవరో ఒకరిచేత రికమెండెషన్ చేయించేవారు. కాని ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇక్కడి వైద్యులు ఎవరి రికమెండెషన్ లేకుండానే ఎవరికైనా ఒకేరకమైన చికిత్సలను అందిస్తున్నారు. వైద్యం అందించే విషయమే కాకుండా మందులు, డైట్ విషయంలో కూడా సూపరింటెండెంట్ రాజారావు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఎలాంటి రోగితోనైనా వారికి అర్థమయ్యేరీతిలో మాట్లాడుతూ వైద్య సేవలు అందిస్తున్నారు.

**కిడ్నీ రోగులకు వరంగా మారిన గాంధీ దవాఖాన....**

సికిందాబ్రాద్ గాంధీఆస్పత్రి కిడ్నీరోగులకు వరంగా మారింది. కార్పొరేట్ ఆస్పత్రులలో అందించే కిడ్నీ మార్పిడీలు గాంధీ దవాఖానలో కూడా విస్తృతంగా జరుపుతున్నారు. ట్రాన్స్‌ప్లాంట్స్ చేయడమే కాకుండా వారికి మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నారు. ట్రాన్స్‌ప్లాంట్స్ తరువాత రోగికి జీవితకాలం మందులను కూడా ఉచితంగా అందజేస్తారు. వీరు అందించే మందులు కొనాలంటే సంవత్సరానికి రూ. లక్షల్లో ఖర్చు అవుతుంది. అలాగే వారికి అందజేసే వైద్య సేవల పట్ల కూడా వైద్యులు అత్యంత శ్రద్ధ తీసుకుంటారు. ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య విషయంలో సూచనలు, సలహాలు అందజేస్తారు. ఇన్‌ఫెక్షన్‌లు సోకే అవకాశం ఎక్కువగా ఉండడం వల్ల వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు.

**శరీరంలో కిడ్నీల ప్రాధాన్యత**

మనిషి జీవించడానికి మన శరీర భాగాల్లో కిడ్నీలు కూడా ఎంతో ముఖ్యమైనవి. అవి పాడైతే ప్రాణాలకు గ్యారంటీ లేనట్లే. శరీరంలోని ఫ్లూయిడ్స్ నుంచి వేస్టేజ్, మలినాలను, అవసరం లేని నీటి శాతాన్ని కిడ్నీలు ఫిల్టర్ చేసి మూత్రం ద్వారా బయటికి పంపిస్తాయి. మన శరీర భాగాల్లో కూడా కిడ్నీలు అత్యంత ప్రధానమైనవి. వీటి అవసరం మన శరీరానికి చాలా ఉంటుంది. ఈమధ్య జరుగుతున్న అసాధారణ మరణాల్లో, అనారోగ్య కారణాల వల్ల మృతిచెందుతున్న వారిలో కిడ్నీ సమస్యలు అధికంగా ఉంటున్నాయి. ఈ విషయాన్ని ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రిసర్చ్ నివేధికలు తెలుపుతున్నాయి. 15సంవత్సరాలు దాటిన వారినుండి వృద్దుల వరకు అనారోగ్య కారణాల వల్ల మృతి చెందుతున్న వారిని తీసుకుంటే దాదాపు 3శాతం మంది కేవలం కిడ్నీలు పాడైపోవడం వల్లే జరుగుతన్నాయని లెక్కలు చెబుతున్నాయి. కిడ్నీలు పాడవ్వడానికి అనేక కారణాలు ఉన్నప్పటికి ముఖ్యంగా డయాబెటిక్, హైబీపీలు ప్రధాన కారణమవుతున్నాయి. దీంతోపాటు యూరిన్ ద్వారా ప్రొటీన్ యూరిన్ ద్వారా వెళ్లడం. డయాబెటిక్, హైబీపీలు ఉన్నట్లు రోగులకు ఉన్నట్లు తెలుస్తుంటుంది. కాని ప్రొటీన్ యూరిన్‌లో వెళ్లడం తెలుసుకోవడం చాలా కష్టం. యూరిన్ రంగును బట్టి కిడ్నీలు పాడైంది, లేనిది తెలుస్తుంది. కిడ్నీలు చాలా వీక్‌గా, పాడైనప్పుడు ప్రొటీన్ ఎక్కువగా పోతుందని, అలాంటప్పుడు మారిన యూరన్ రంగును బట్టి తెలుసుకోవాలని నేఫ్రాలజిస్టు సూచిస్తున్నారు. కిడ్నీలో సమస్యలు ప్రారంభం అయినట్లు గుర్తిస్తే వెంటనే వైద్యులను కలవాలని చెబుతున్నారు. ఇలాంటి రోగులకు గాంధీఆస్పత్రిలో అత్భుతమైన వైద్యం అందజేస్తున్నారు. కిడ్నీల మర్పిడి మాత్రమే కాకుండా లైవ్ ట్రాన్స్‌ఫ్లాంట్స్ కూడా అత్భుతంగా చేస్తున్నారు. ఇలాంటి చికిత్సలను ప్రైవేట్ ఆస్పత్రులలో లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది.

## అడ్డగోలుగా రయ్..రయ్..రయ్

(మొదటిపేజీ తరువాయి)

క్రమశిక్షణ పెంపోందించుటకు రూపొందించిన ట్రాఫిక్ నియమాలను వాహనదారులు తుంగలో తొక్కుతున్నారు. కూడళ్ల వద్ద రెడ్ సిగ్నల్ పడిన వాటిని లెక్కచేయకుండా రయ్ రయ్ మంటూ దూసుకెళ్తున్నారు. జనవరి నుంచి జులై వరకు ట్రాఫిక్ పోలీసులు విధించిన చలాన్లలో సిగ్నల్ జంపింగ్ కేసులు 4,90,020, జిబ్రా లైన్ క్రాస్ చేసినవి 14, 79,090 నమోదయ్యాయి.

**సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్..**

పది మంది వాహనదారుల్లో కనీసం ముగ్గురు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. ఒక చేతితో సెల్‌ఫోన్ మరొక చేతితో స్టీరింగ్ పట్టుకొని వాహనాలు నడుపుతున్న దృశ్యాలు నగరంలో కోకొల్లలు. ద్విచక్ర వాహనదారులైతే చెవిలో ఇయర్ ఫోన్ పెట్టుకొని, లేదా హెల్మెట్ చాటున సెల్‌ఫోన్ పెట్టుకొని ఫోన్లు మాట్లాడుతూ.. పాటలు వింటూ ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్నారు. ఇలాంటి వారిపై జనవరి నుంచి జులై వరకు 2,91,770 కేసులు నమోదు చేశారు.

**నంబర్ ప్లేట్ లేని వాహనాలు..**

ట్రాఫిక్ చలానాలు తప్పించుకోవడానికి చాలామంది నంబర్ ప్లేట్ పెట్టుకోకుండా వాహనాలను నడుపుతున్నారు. మరికొంత మంది వాహనాలకు ఉన్న నంబర్ ప్లేట్‌లను ట్రాఫిక్ పోలీసుల కెమెరాలకు చిక్కకుండా వాటిని వంచడం, నంబర్లు కనబడకుండా చేయడం వంటివి చేస్తున్నారు. ఇలా నంబర్ ప్లేట్‌లు లేకుండా వాహనాలు నడిపే వారిపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ ఏడు నెలల్లో 3,69,165 కేసులు నమోదు చేశారు.

**డ్రంకన్ డ్రైవ్‌లో..**

రాత్రయిందంటే చాలు పీకల దాకా మద్యం తాగి నగర రోడ్లపై హంగామా సృష్టిస్తున్నారు మందుబాబులు. పోలీసులు ఎన్ని తనిఖీలు చేపట్టినా, జరిమానాలు విధించినా వారిలో మార్పు రావడం లేదు. ఈ సంవత్సరం జనవరి నుంచి జులై వరకు 1,53,025 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి.

**మైనర్ డ్రైవింగ్..**

ఈ మధ్య కాలంలో మైనర్ డ్రైవింగ్ ప్రమాదాలు పెద్ద ఎత్తున నమోదవుతున్నాయి. పోలీసులు ఎన్ని సార్లు కౌన్సిలింగ్ నిర్వహించిన వారిలో మార్పు రావడం లేదు. ఏడు నెలల కాలంలో 28,690 కేసులు నమోదయ్యాయి.

**వాహనదారులు రోడ్లపై క్రమశిక్షణతో మెలగాలి.. రాహుల్ హెగ్డే, ట్రాఫిక్ డీసీపీ**

నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ప్రజలు, వాహనదారులు క్రమశిక్షణతో మెలగాలి. కొందరు వాహనదారుల అత్యుత్సాహం, గమ్యస్థానానికి చేరుకోవాలనే తొందరలో మిగతా వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. దీని వలన రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు

# భక్తిశ్రద్ధలతో బోనాల జాతర

**ఎల్.బి.నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ మోహన్ నగర్ లోని దుర్గామాత దేవాలయం, బిజెపి కార్యాలయం దగ్గర అమ్మవారి ఘటం ఊరేగింపు కమిటీ అధ్యక్షులు బోల్గం యశ్పాల్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, బిజెపి రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, బిజెపి హైదరాబాద్ అధ్యక్షుడు భరత్ గౌడ్, జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి, రాధా ధీరజ్ రెడ్డి, వంగ మసూన్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు జగ్రిగల శ్రీకాంత్, గీతా రెడ్డి, శ్రీధర్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, బొంగు రఘు, విష్ణువర్ధన్ రెడ్డి, న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పీఠం ప్రదీప్ కుమార్, పవన్ కుమార్ తదితరులు ఊరేగింపు ప్రారంభ ఉత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పాల్ గౌడ్ వారిని సత్కరించారు. అమ్మవారి ఊరేగింపు సత్య నగర్, శ్రీ బంగారు గవ్వల రేణుకఎల్లమ్మ మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కిరణ్ కుమార్, వినోద్ కుమార్, రాజేందర్, వేణు, గౌరవ, రాజేష్, కులకర్ణి, సంప్రీతి, వెంకట్, యశ్వంత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు



మారుతీనగర్‌లో బోనాల జాతర సందర్భంగా శివసత్తుల

కొత్తపేట డివిజన్ మారుతి నగర్ లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం వ్యవస్థాపకురాలు శ్రీమాతా శక్తి పీఠం దేవి ఉపాసకులు పిఠాధిపతి గురుమాత సోమ వెంకటమ్మ అమ్మవారి నేతృత్వంలో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. అమ్మవారికి బోనాలు సమర్పించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దేవాలయం వద్ద శివసత్తులు విన్యాసాలు నిర్వహించారు.



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**శ్రీ జగదాంబికా మహంకాళి అమ్మవారికి మహా నైవేద్యం**

**మెహిదీపట్నం, ఆగస్టు 3, ప్రభాతవార్త :** గోల్కొండ శ్రీ జగదాంబికా మహంకాళి అమ్మవారికి ఆదివారం మహా నైవేద్యాన్ని సమర్పించారు. బోనాల ఉత్సవాలు ముగిసిన అనంతరం ఈ మహా నైవేద్యాన్ని అమ్మ వారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అమ్మ వారికి దేవాలయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు మహా నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. అనంతరం దేవాలయ చైర్మన్ కొండెపూడి చంటిబాబు మాట్లాడుతూ... బోనాల ఉత్సవాలలో వివిధ శాఖల అధికారులతో పాటు స్థానికంగా ఉన్నటువంటి వృత్తి పని వారి సంఘం సభ్యులు స్వచ్ఛంద సేవకులు అమ్మవారి సేవలో పాల్గొని బోనాల ఉత్సవాలు విజయవంతం అయ్యేందుకు నిరంతరం కృషి చేయడం జరిగిందన్నారు. వారికి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో మెమోటోను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగిందన్నారు.

## ముగ్ధ మనోహరం కూచిపూడి రంగ ప్రవేశం

(మొదటి పేజీ తరువాయి)

అన్నమాచార్య విరచిత హనుమంతుడిని స్తుతిస్తూ కీర్తన మాంగాంబుధి హనుమంత; సారమైన మాటలెంతో జావళి; ధనశ్రీరాగం, ఆదితాళంలో తిల్లానా అంశాలను అద్భుత హావభావాలను శృతి లయబద్ధంగా ప్రదర్శించి చివరిగా మంగళంతో ప్రతీఒక్కరి ప్రశంసలు అందుకుంది. గురువు ప్రీతి నట్టువాంగం, స్వాతిప్రసాద్ గాత్రం, వి.శ్రీధరాచారి మృదంగం, కె.సాయికుమార్ వయోలిన్, వెంకటేశ్ వేణువుతో అద్భుత వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు.



బహుమతి అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

## ప్రతి ఒక్కరిలో క్రీడా స్ఫూర్తి ఉండాలి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడ టిఆర్ఎస్ ట్రైనింగ్ సెంటర్ లో కెఎన్ఆర్ సైక్లింగ్ నాగరాజు ఆధ్వర్యంలో ఇందు ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన తెలంగాణ హిస్టారికల్స్ 10కే రన్ రైడ్ 3వ ఎడిషన్ లో ఉప్పల శ్రీనివాస్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల మాట్లాడుతూ మన భాష మన హక్కు, మన వనరుల సంపద మన ముందుబాట అని మన కవులు, మన చరిత్ర, మన చారిత్రాత్మక కళా ఖండాలు మన తెలంగాణవి అన్నారు. మన పాలన, మన సంస్కృతి, మన ఆత్మ గౌరవం, మన తెలంగాణ అని ఎందరో మహానుభావుల త్యాగనిరతికి స్ఫూర్తి అన్నారు.

## మాచిరాజు సాహిత్యసేవలు అజరామరం

**రవీంద్రభారతి, ఆగస్టు 3 ప్రభాతవార్త :** మాచిరాజు సాహిత్యరంగానికి చేసిన సేవలు అద్భుతం, అనంతం, అజరామరమని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డా. పత్తిపాక మోహన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో బాలసాహిత్య పరిషత్, బాలసాహిత్యపీఠం సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత చొక్కాపు వెంకటరమణ సభాధ్యక్షతన జరిగిన మాచిరాజు సీతారామయ్య, రత్న మాచి దంపతుల పేరిట ఏర్పాటు చేసిన స్మారక బాలసాహిత్య పురస్కారాల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన పత్తిపాక మోహన్ ప్రముఖ చయితలు బి.నాగేశ్వరరావు, ఎ.వెంకట సుబ్బలక్ష్మికి స్మారక బాలసాహిత్య పురస్కారాలను ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. అనంతరం మాచిరాజు కామేశ్వరరావు రచించిన చందమామ కథలు, ఉండ్రాళ్ళ రాజేశం రచించిన బాలకథా చంద్రిక బాలల కథా పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చంద్రప్రతాప్, శ్రీనివాస్ కుమార్, పైడిమర్రి రామకృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## విశ్వకర్మలు రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలి

**సైఫాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** సమాజానికి విశేషమైన సేవలు అందిస్తున్న విశ్వకర్మలు రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలని, బిసిల రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని బిసి ఇంటెకు చ్వల్ ఫోరం చైర్మన్, విశ్రాంత ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు సూచించారు. విశ్వకర్మ నాలెడ్జ సెంటర్ అధినేత విశ్వనాధుల పుష్పగిరి 450 కిలోమీటర్ల పాదయాత్ర ముగింపు సందర్భంగా ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన అభినందన సభలో చిరంజీవులు మాట్లాడారు.

## ఐటి చీఫ్ కమిషనర్‌కు సత్కారం

**సైఫాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** ఆదాయపు పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం.అనిల్‌కుమార్‌ను తెలుగు రాష్ట్రాల టాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిఏ చంద్రశేఖర్ వేముల నేతృత్వంలో అసోసియేషన్ ప్రముఖులు పి.వి.నారాయణరావు, ఆశిష్‌జోషి, రాందేవ్ బుటాడా, అమృత్‌కుమార్ కోటా, హితేష్‌జైన్, ఎపి దహిమా తదితరులు ఆదివారం నాడిక్కడ ఘనంగా సత్కరించారు.

# పింగళి దేశ భక్తి భావితరాలకు చిరస్మరణీయం కావాలి




వెంకట సుబ్బారావుకు పింగళి వెంకయ్య వంశీ జాతీయ పురస్కారం ప్రదానం చేస్తున్న హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, చిత్రంలో డాక్టర్ కె.వి.రమణాచారి, వంశీ రామరాజు తదితరులు

**చిక్కడపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త:** ఆజన్మాంతం భరత మాత సేవలో తరించిన మహనీయుడు పింగళి వెంకయ్య అని హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వాహక సంస్థ అధినేత డాక్టర్ వంశీ రామరాజు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతి సభ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ సర్వోదయ జాతీయ నాయకులు, గాందేయవాది గోవిందరాజు వెంకట సుబ్బారావుకు పింగళి వెంకయ్య వంశీ జాతీయ పురస్కారం ప్రదానం చేసి ప్రసంగించారు. డాక్టర్ కె.వి.రమణాచారి మాట్లాడుతూ నిర్వాసర్ధ సేవకుడు వెంకట సుబ్బారావుకు ఈ పురస్కారాన్ని అందించడం విశేషమన్నారు. జాతీయ పతాకం వినువీధిలో ఎగురుతున్నంత కాలం పింగళి వెంకయ్య మనకు గుర్తుంటారని, ప్రతి భారతీయుడు ఎప్పటికీ గర్వించే త్రివర్ణ పతాకాన్ని అందించిన ఆ మహనీయుని స్మరించుకోవాలి అని అన్నారు. అన్ని రంగాలలో, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికోసం పాటుపడిన నిర్మాణాత్మక కార్యకర్తగా, గాంధీ ఆశయాలకు అనుగుణంగా పాటుపడిన నిరాడంబర వ్యక్తి అంతటి మహోన్నత వ్యక్తి భూదానం సుర్గ్గారావుగారికి మరో మహనీయుడు, దేశభక్తి పరాయణులు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వంశీ జాతీయ పురస్కారం ప్రధానం చేయడం గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితి కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, సీనియర్ పాత్రికేయులు మా శర్మ, పింగళి వెంకయ్య మనమడు జీవిఎల్ నరసింహం, నిర్వాహక సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ తెన్నేటి సుధాదేవి, మేనేజింగ్ ట్రస్టీ సుంకరపల్లీ శైలజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశభక్తి భక్తి గీతాలాపన గాయని గాయకులు వి ఆర్ కె ఫణి, హృషికేష్ శర్మ, రవిశంకర్ ఠాగూర్, పి ఎస్ పి కాశ్యప్, వి. పాంచజన్య, ఎస్ పి నిర్మల శంకర్, మధురవీణ, రమాదేవి అవధానులు, రాధారాణి, సుసర్ల ప్రసన్న తదితరులు అద్భుతంగా గానం చేశారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా సుధామయి వ్యవహరించారు.

## అజాత శతృవు బండారు దత్తాత్రేయ

**-ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి**

**చిక్కడపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త:** హర్యానా పూర్వ గవర్నర్ బండారు తాను రచించిన 'ప్రజల కదే నా ఆత్మ కథ' అనే గ్రంథాన్ని ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచాకి ఆదివారం బహుకరించారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన దత్తాత్రేయ అదే సభలో పాల్గొన్న డాక్టర్ కె.వి.రమణాచారికి ఈ పుస్తకాన్ని బహుకరించారు. గత కొన్ని దశాబ్దా లుగా సుదీర్ఘంగా రాజకీయ జీవితాన్ని గడిపిన దత్తాత్రేయ ఈ విధంగా తన అనుభవాలను, సంఘటనలను పుస్తక రూపంలో తీసుకురావడం విశేషమన్నారు. వివాదరహితులుగా, రాజకీయాల్లో తనకంటు ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన వ్యక్తి దత్తాత్రేయ అని కీర్తించారు.




రమణాచారికి ప్రజల కదే నా ఆత్మ కథ గ్రంథాన్ని బహుకరిస్తున్న హర్యానా పూర్వ గవర్నర్ బండారు

## టాలీవుడ్ కొరియోగ్రాఫర్ మీద ఫోక్సో కేసు

### రిమాండ్‌కు తరలించిన పోలీసులు

**గచ్చిబౌలి, ఆగస్టు 3 ప్రభాతవార్త :** మరో టాలీవుడ్ కొరియోగ్రాఫర్ లైంగిక వేధింపుల కేసులో అరెస్టు అయ్యాడు. ఢీ షోలో డ్యాన్సర్, కొరియోగ్రాఫర్ క్రిష్ణ మాస్టర్ మీద ఫోక్సో కేసు నమోదు కాగా గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కుటుంబ కలహాలతో మొదటి భర్తతో విడిపోయిన ఓ మహిళను ఢీ షోలో డ్యాన్సర్, కొరియోగ్రాఫర్ రాధాక్రిష్ణ గత సంవత్సరం క్రితం రెండవ వివాహం చేసుకున్నాడు. కాగా సదరు మహిళకు 10వ తరగతి చదువుతున్న కుమార్తె ఉండగా, కుమార్తెతో కలిసి ఇద్దరు నివాసం ఉంటున్నారు. కాగా కొంత కాలంగా క్రిష్ణ మాస్టర్ తన మైనర్ కుమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండడంతో సదరు మహిళ జూలై 9వ తేదీన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసింది. ఈ పిర్యాదుపై ఫోక్సో కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు క్రిష్ణ కోసం గాలింపు చేపట్టారు. బెంగళూరులోని తన అన్న వద్ద ఉంటున్న క్రిష్ణను అరెస్టు చేసిన గచ్చిబౌలి పోలీసులు కంది జైలుకు తరలించారు. కాగా గతంలో సోషల్ మీడియాతో పలువురు యువతులు, అమ్మాయిలను మోసం చేసినట్లు క్రిష్ణపై ఆరోపణలు ఉన్నాయి.

## ఘనంగా వనం మైసమ్మ విగ్రహావిష్కరణ

**సరూర్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** హైదరాబాద్ శివార్లలోని బాలాపూర్ గ్రామంలో సూరమాంబ సమేత కంఠ మహేశ్వర స్వామి ఆలయంలో వనం మైసమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మైసమ్మ అమ్మవారి విగ్రహాన్ని భక్తి శ్రద్ధలతో ప్రతిష్టించి పూజలు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, గ్రామ సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు కళ్లెం ఎల్లారెడ్డి తదితరులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బాలాపూర్ గౌడ సహకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టేకుల సుధాకర్‌రెడ్డి, ఇక్కె శ్రీనివాస్, తూళ్ళ నరహరిగౌడ్, గండికోట యాదయ్య, ధన్‌రాజ్‌గౌడ్, గిర్కట్టి కృష్ణాగౌడ్, జూకంటి సురేష్‌గౌడ్, అరవింద్‌గౌడ్, ఆంజనేయులు, తూళ్ళ సునీత హరిబాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 18 శాతం రిజర్వేషన్ హామీని అమలు చేయాలి

**చిక్కడపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ దళితులకు ఇస్తానన్న 18 రిజర్వేషన్ హామీని అమలు చేయాలని తెలంగాణ మాలల సంఘాల జేఏసీ చైర్మన్ దయానంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు చేవెళ్ల డిక్లరేషన్ లో కాంగ్రెస్ పార్టీ దళితులకు 15శాతం నుండి 18శాతానికి రిజర్వేషన్లు పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలనీ డిమాండ్ చేశారు. ఆదివారం జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ మాలల సంఘాల జేఏసీ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీని ప్రకటించారు. చైర్మన్గా దయానంద్, వర్కింగ్ కమిటీ చైర్మన్‌లు దయానంద్, వైస్ చైర్మన్ అనంత రాములు, ఎం కేశవులు, గడ్డం సత్యనారాయణ, చైర్మన్లు నర్మెట్ట మల్లేష్, నీలం పద్మారావు, నరేష్, వైస్ చైర్మన్లు ఎన్ మారుతి, లీగల్ సెల్ కన్వీనర్ అద్దంకి ఆదం, మహిళా విభాగం నాయకురాలు భువనగిరి మంగ తదితరులు నూతన కమిటీలో నియమితులైన వారిలో ఉన్నారు.

## ఏకలవ్య ఫైనాన్స్ కార్పొరేషన్ చేయాలి

**చిక్కడపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకలవ్య ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసే విధంగా తనవంతు కృషి చేస్తానని ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ హామీ ఇచ్చారు. ఆదివారం బాగ్ లింగంపల్లి, సుందరీ విజ్ఞాన కేంద్రంలో ఎరుకల హక్కుల పోరాట సమితి 29వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం ఎరుకుల ఉద్యోగుల హక్కుల రాష్ట్ర కో కన్వీనర్ ఒలు గుత్తుల పోచయ్య అధ్యక్షతన జరిగింది.

## శ్మశానవాటికల్లో గంజాయి తాగే స్థితికి దిగజారారు

### మాజీ హోం మంత్రి సబితారెడ్డి ఆవేదన

**సరూర్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపాధి కోల్పోయిన యువత స్మశానవాటికల్లో గంజాయి తాగే పరిస్థితి నెలకొని ఉందని మాజీ హోం మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగర శివార్లలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ సాయినగర్ కాలనీలో ఆదివారం సిసి కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆమె స్థానిక మాజీ కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, కాలనీవాసులతో కలిసి సిసి కెమెరాలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు.

## 7న గోవాలో జాతీయ ఒబిసి మహాసభ

**హైదరాబాద్ ఆగస్టు 3 ప్రభాతవార్త:** ఈనెల ఆగస్టు 7న గోవా రాష్ట్రంలోని డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆడిటోరియంలో జరిగే జాతీయ ఓబీసీ మహాసభకు దేశవ్యాప్తంగా ఓబీసీ ఉద్యోగులు కదిలి వచ్చి విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డి.రమ ఆధ్వర్యంలో గోవాలో జరిగే జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ బీసీ ఉద్యోగుల సంఘం రూపొందించిన పోస్టర్‌ను జాజుల శ్రీనివాస్ గౌడ్,రాష్ట్రీయ ఒబిసి ప్రదాన కార్యదర్శి ముఖ్యఅతిథిలుగా పాల్గొని ఆవిష్కరించారు. బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రమ, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్,బిసి విద్యార్ది సంఘం అద్యక్షులు తాటికొండ విక్రం గౌడ్, బిసి ఉద్యోగ సంఘాల నేతలు రాదరాణి,వారాల శ్రినివాస్, జ్ఞ్యానేశ్వర్, మహేశ్ యాదవ్,అనురాద,షమీమ్ సుల్తాన,మహేంద్ర సాగర్, రాజేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గోన్నారు.

## డిస్కస్‌త్రోలో శ్యామలకు బంగారు పతకం

**బేగంపేట ఆగస్టు 3,ప్రభాతవార్త :** తెలంగాణా రాష్ట్ర పోలీసు శాఖలో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న వి.శ్యామల మరోసారి తన అధ్భుత ప్రతిభను ప్రదర్శించి బంగారు,రజత పతకాలను సాధించింది. ఆఫ్‌సీజన్ తెలంగాణా స్టేట్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బేగంపేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న వి.శ్యామల తన ప్రతిభను మరో సారి ప్రదర్శించింది. ఆదివారం జింఖానా మైదానంలో నిర్వహించిన పోటీల్లో డిస్కస్ త్రోలో బంగారు పతకం, షార్ట్‌పుట్‌లో రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఐఎంఏఏ అధ్యక్ష కార్యదర్శులు కొండా విజయ్‌కుమార్,నూనె సురేందర్ పటేల్‌లు శ్యామలకు బంగారు, రజత పతకాలతో పాటు ప్రశంసా పత్రాలను బహుకరించి అభినందించారు.



పతకం అందిస్తున్న ఎన్ఐఎంఏఏ అధ్యక్ష కార్యదర్శులు కొండా విజయ్‌కుమార్,నూనె సురేందర్ పటేల్

## జింఖానా గ్రౌండ్‌లో క్రీడా పోటీలు ప్రారంభం

**కంటోన్మెంట్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** 30 సంవత్సరాలకు పై బడిన స్త్రీ,పురుషులు ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని, క్రీడలకు వయసుతో సంబంధం లేదని, దాంతో ఆరోగ్యవంతమైన జీవితానికి క్రీడల్లో పాల్గొనడం చాలా మంచిదని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు.


**TENDER NOTICE**

APARNA HillPark AVENUES

**TENDERS ARE INVITED FOR END-TO-END PROPERTY MAINTENANCE OF**

**APARNA HILLPARK AVENUES OWNERS' WELFARE SOCIETY**
**Chanda Nagar 500050**
*Email* : **ahpa.chandanagar@gmail.com**

*Tender Start Date* : **4th August 2025: 09:00 Hours**
*Tender Close Date* : **23rd August 2025: 17:00 Hours**
*Price of Tender* : **2000/-**

Prescribed application form is available from **4th Aug 2025** at Society Office. Completed application (1) & Price Bid (2) should be in sealed envelopes and separately dropped in the tender box located in the site before the close date.
The Managing Committee reserves the right to accept or reject the bid without assigning any reason thereof.



హత్నూర ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకుల పరస్పర ఫిర్యాదులు

**హత్నూర ఆగస్టు 3 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శనివారం జరిగిన రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా జరిగిన పరస్పర వాదోపోవాదనలు, తోపులాటలకు సంబంధించి జరిగిన గొడవను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ, టిఆర్ఎస్ పార్టీల నాయకులు హత్నూర పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. రేషన్ కార్డుల పంపిణీలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సందర్భంగా బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు సంబంధించిన నాయకులు కార్యకర్తలు మధ్య గొడవ జరిగిన సంగతి తెలిసిందే.

## హత్నూరలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**హత్నూర, ఆగస్టు 3, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. నల్లోల్ల ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం ద్వారా 59 ఉపకులాలకు సమ న్యాయం జరిగిందన్నారు. ఈనెల 13న నిర్వహించ తలపెట్టిన 'చలో హైదరాబాద్ వికలాంగుల చేయూత పెన్షన్ల మహాగర్జన' బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నల్లోల్ల మొగులయ్య, మచ్చురి సాయిలు,నల్లోల్ల ప్రవీణ్ కుమార్, నల్లోల్ల పెంటయ్య, నరేందర్, పండుగ బాలకిషన్, వలిగారి లక్ష్మి మ్నారి, ఆశనోల్ల దుర్గాదాస్, నల్లోల్ల ప్రభు, కొండగళ్ల మల్లేష్, బక్కోల్ల నర్సింహులు,చిలిపి చెట్టి ఎల్లయ్య ,నల్లోల్ల దశరథ్, పొట్లగల్ల నాగేష్, విజయ్, రాజలింగం, పసుల నారాయణ పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నేతలు



బోనాల కార్యక్రమంలో పాల్గొన్న భూపాల్‌రెడ్డి తదితరులు

**రామచంద్రాపురం, ఆగస్టు 3, ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గం భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పోచమ్మ, ఎల్లమ్మ తల్లులకు బోనాల ఉత్సవాలు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి మాజీ ప్రొటెం చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ కో–ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధూఆదర్శ్‌రెడ్డి, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, మాజీ జడ్పీటిసి సభ్యులు శ్రీకాంత్‌గౌడ్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ప్రశాంతంగా సాగేలా ఆలయ కమిటీ బాధ్యులు నరసింహ, విజయ్‌గౌడ్, సతీష్, సామ్యూల్, వినయ్‌కుమార్, శ్రీకాంత్, నరేష్ సహకరించారు. కార్యక్రమంలో నాయకులు జగన్నాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేష్, జానీ, బిఆర్ఎస్ మహిళా సర్కిల్ అధ్యక్షురాలు రాణ యాదవ్, శ్రీలత పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల ఇబ్బందులు పట్టించుకోని అధికారులు



యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు

**కొల్చారం, ఆగస్టు 3 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కొల్చారం లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా రావడంతో రైతులు క్యూలో నిలబడి టోకెన్లు తీసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ యూరియా కోసం రైతుల రోజుల తరబడి ఎదురుచూస్తున్న పరిష్కారానికి దారి దొరకడం లేదన్నారు. ప్రభుత్వాలు ఫర్టిలైజర్ షాపుల వద్ద బారులు తీరుతున్న రాష్ట్ర ప్రభుత్వం వైపు యూరియా కొరత లేదని చెప్తున్నా ఇక్కడ యూరియా దొరకడం లేదని రైతులు వాపోతున్నారు యూరియా కోసం ఫర్టిలైజర్ షాపుల వద్ద బారులు తీరిన పరిస్థితి నెలకొందని రైతులు అంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

### ఎస్ఐని సన్మానించిన బిజెపి నేత

**కొల్చారం, ఆగస్టు 3 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో నూతనంగా ఎస్ఐ బాధ్యతలు చేపట్టిన అహ్మద్ మొహిద్దీన్ ను కొల్చారం మండల బిజెపి మండల అధ్యక్షులు హరీష్, సంగమేశ్వర్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి ఎస్ఐని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హరీష్, సంగమేశ్వర్ మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణలో పోలీసులు ముందుంటారని అలాంటి పోలీసులకు మేము అండగా ఉంటూ శాంతి భద్రత పరిరక్షణలో సహాయ సహకారాలు అందిస్తామమన్నారు.కార్యక్రమంలో బిజెపి నాయకులు యాదగిరి,బిజెపి కార్యకర్తలు తదితరులు ఉన్నారు.





ఎస్సైని సన్మానిస్తున్న బిజెపి నాయకులు

# రైతువేదికలో పోలీసుల వ్యవహార శైలిని జీర్ణించుకోలేకపోతున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు!

**హత్నూర ఆగస్టు 3, ప్రభాతవార్త :**
హత్నూరలో శనివారం జరిగిన రేషన్ కార్డులు, షాది ముబారక్, కళ్యాణ్ లక్ష్మి చెక్కుల పంపిణీలో జరిగిన తోపులాటలో, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు వ్యవహరించిన తీరును ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. అధికారంలో ఉన్నామా, ప్రతిపక్షంలో ఉన్నామా అని అనుమానాన్ని కలిగించే విధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని వారు మదనపడుతున్నట్లు తెలిసింది. హత్నూరలోని రైతువేదికలో శనివారం ఏర్పాటు చేసిన రేషన్‌కార్డులు, షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయడానికి కాంగ్రెస్ శ్రేణులు పూనుకోగా, కార్యక్రమానికి హాజరైన బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అడ్డుకోవడంతో ఇరు పార్టీల నాయకులు కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగిన విషయం తెలిసిందే. తోపులాట సందర్భంగా పోలీసులు కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను బలవంతంగా రైతువేదిక నుంచి బయటికి పంపించి వేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ సమావేశానికి వెళ్లకుండా రైతువేదిక తలుపులు మూసివేసి పోలీసులు అడ్డుగా నిల్చున్నారు. అదే సమయంలో బిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు సమావేశం జరుగుతున్న హాల్లో ఉండడం విశేషం. అధికార పార్టీకి చెందిన తమను సమావేశం హాలులో నుంచి బలవంతంగా బయటికి పంపించి వేయడంతోపాటు తిరిగి లోపలికి వెళ్లనీయకపోవడం, సమావేశంలో టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఉండేందుకు వీలు కల్పించడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేయడానికి సమయం ఇవ్వకపోవడంతోపాటు సమావేశం జరిగే హాల్లోకి అనుమతించకపోవడం, కార్యకర్త నాయకులను బయటకు బలవంతంగా పంపిచడంలో పోలీసులు వ్యహరించిన తీరును కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జీర్ణించుకో లేకపోతున్నారు. తాము అధికార పక్షంలో ఉన్నామా, ప్రతిపక్షంలో ఉన్నామా అనుమానాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులతీరు ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు న్యాయం చేయలేకపోతారని వారు ఆవేదనను జిల్లా ముఖ్య నాయకులతో వ్యక్తం చేసినట్లు సమాచారం. శనివారం జరిగిన వ్యవహార మొత్తాన్ని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డికి మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డిలకు వివరించడంతో వారు హుటాహుటిన దౌల్తాబాద్‌కు చేరుకొని జరిగిన విషయాలను తెలుసుకున్నారు. అనంతరం వారు హత్నూర పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, స్టేషన్‌లోఉన్న పటాన్‌చెరు డిఎస్పి ప్రభాకర్‌రావుకు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును, ఆయనకు వివరించి, తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.



దేవతల విగ్రహాల ప్రతిష్టాపనలో పాల్గొన్న మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్

## విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న మాజీ మంత్రి

**జహీరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** పట్టణంలోని వెంకట రమణ కాలనీలో నిర్వహించిన శ్రీ పోచమ్మ, శ్రీబాలమ్మ తల్లుల విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించేలా కరుణించాలని అమ్మవార్లను వేడుకున్నట్లు వివరించారు.కార్యక్రమంలో ఎంఎపిసి డైరెక్టర్ వంశీ రాజ్, కాంగ్రెస్ నాయకులు సిద్దన్నపాటిల్, వీరారెడ్డి, నరసింహారెడ్డి, సంతోష్, రాకేష్, మూర్తజ్, శ్రీనివాస్ నాయక్, శ్రీనివాస్ శాంసన్, గౌసోద్దిన్, జమీల్, ఆలయ కమిటి బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### ఆలయాలను దర్శించుకున్న నరోత్తం

**జహీరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం కనులపండువగా సాగిన శ్రీపోచమ్మ, శ్రీబాలమ్మ తల్లుల విగ్రహ ప్రతిష్టాపన పూజ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఏర్పుల నరోత్తం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు ప్రశాంతంగా అష్ట ఐశ్వర్యాలతో తులతూగేలా కరుణించాలని అమ్మవార్లను వేడుకున్నట్లు నరోత్తం వివరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్, వెంకట్, శికారి గోపాల్, చెంగల్ జైపాల్, నర్సింహారెడ్డి, శికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు టై, బెల్టులు అందజేత

**కొండపాక, ఆగస్టు 2, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిదని కుకునూరుపల్లి ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. శనివారం కుకునూరుపల్లి మండలం తిప్పారం గ్రామానికి చెందిన సయ్యద్ తబ్రేజ్ ఆర్థిక సహాయంతో గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 120 మంది విద్యార్థులకు షూ, టై, బెల్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇవో బచ్చలి సత్తయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఒకే మాదిరి గా ఉండాలనే ఆలోచనతో టై, షూ, బెల్టులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం దాత సయ్యద్ తబ్రేజ్ మాట్లాడుతూ విద్యా ర్థులు బాగా చదువుకుని గ్రామానికి మంచిపేరు తెవాలన్నారు. కార్యక్రమం లో పాఠశాలల ఉపాధ్యాయులు హెచ్ఎం సిహెచ్ రవి, శివకుమార్, అంజయ్య, రవీందర్, అరుణ, అనిల్, కనకయ్య, రామకృష్ణారెడ్డి, మాధురి, సిఆర్‌పి సంతోష్, ఎఎపిసి చైర్ పర్సన్ రేణుక, గ్రామ యువకులు నవీన్, సాయి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### మంద ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేత

**కొండపాక, ఆగస్టు 2, ప్రభాతవార్త :** మంద భూమవ్వ లక్ష్మారెడ్డి ఫౌండేషన్ అధ్వర్యంలో అడపిల్లల పెళ్లిల్లు చేసిన కుటుంబాలకు శనివారం ఆర్థిక సహాయం అందించారు. మండల పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన మంద భూమవ్వ లక్ష్మారెడ్డి ఫౌండేషన్ చైర్మన్ మంద భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన పౌండేషన్ మూడవ వార్సికోత్సవం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మూడు సంవత్సరాల నుండి అడపిల్లల పెళ్లిళ్లు చేసిన 11 కుటుంబాలకు రూ॥ 5116లను ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల పాఠశాలల్లో చదివి మొదటి, రెండవ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెడల్‌తోపాటు ప్రోత్సహక బహుమతిని. ఇటీవల్ల కాలంలో చనిపోయిన వ్యక్తుల 3 కుటుంబాల సభ్యులకు రూ॥ 5116 విలువ గల చెక్కులను అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మంద శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపి టిసిలు యాదగిరి, కొత్తగొల్ల మల్లేశం, మంతూరి రాములు, మంద ప్రభాకర్ రెడ్డి, మంద రవీందర్‌రెడ్డి, హెచ్ఎం శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేదలకు సేవ చేయడమే వాసవీ క్లబ్ లక్ష్యం

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** సిద్దిపేట వాసవీక్లబ్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట గ్రామానికి చెందిన నూతన వధువు వివాహ నిమిత్తం కాచం యాదగిరి ఆర్థిక సహాయంతో ఆదివారం పుస్తెలు, మెట్టెలు, చీర అందజేశారు. ఈ సందర్భంగా వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ కో–ఆర్డినేట్ నేతి వేణుకుమార్ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడమే వాసవీక్లబ్ ధ్యేయమని భవిష్యత్‌లో పేదల కోసం మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మురంశెట్టి కుమార్, చిగుళ్లపల్లి సత్యనారాయణ, ధనలక్ష్మీ, బెజగాం రమేష్, మర్యాల వీరేశం, ఉప్పల రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రామయంపేటలో ఘనంగా స్నేహితుల దినోత్సవం

**రామాయంపేట, ఆగస్టు 3,ప్రభాతవార్త:** ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా రామయంపేట పట్టణంలోని శ్రీకర ఫంక్షన్ హాల్ లో 1987 పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు సమావేశమై ఉత్సవాలు జరుపుకున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా పదవ తరగతి 1987 బ్యాచ్ కు చెందిన స్నేహితులు దూర ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వారి సాధన బాధాకాల్వ చర్చించుకున్నారు.. ఈ సందర్భంగా నిజాంపేట మండలం మిషన్ భగీరథ తిని నక్క బిక్షపతి మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవం సందర్భంగా పదవ తరగతి బ్యాచ్ స్నేహిత్నుల కలవడం జరిగిందన్నారు... భవిష్యత్తులో బీద వర్గాల వారికి సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 1987 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన డి. జి .శ్రీనివాస శర్మ. సకల0 గంగాధర్ గుప్తా.శీలం మల్లారెడ్డి, చర్ప్యాద మహేందర్ రెడ్డి, కొండంగారీ రమేష్,ఎనిశెట్టి శ్రీనివాస్, బల్ల యాదగిరి, నవాత్ శ్రీనివాస్, నక్క రమేష్ చారి పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

**చిన్నశంకరంపేట, ఆగస్టు 3,ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధి గవ్వలపల్లి చౌరస్తాల ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం... గవ్వలపల్లి పంచాయతీ పరిధి ఆగ్రహారం గ్రామానికి చెందిన శంకరయ్య ద్విచక్రవాహనంపై మదూర్ నుండి గవ్వలపల్లి చౌరస్తాకు వెళ్తున్నాడు. మెదక్ నుండి చెగుంట వైపునకు వెళ్తున్న జంగరాయి గ్రామానికి చెందిన యువకులు శంకరయ్య వాహనాన్ని బలంగా ఢీ కోట్టారు. ఈ ప్రమాదంలో శంకరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు భాగ్యనగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా శంకరయ్య కుడికాలు నరం తెగిపోయిందని, సోమవారం వైద్యులు శస్త్రచికిత్స చేయనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

## మతపరమైన రిజర్వేషన్‌లతో బిసిలకు అన్యాయం

### బిజెపి పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు



మాట్లాడుతున్న శంకర్‌బాబు

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** మతపరమైన రిజర్వేషన్‌లతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని భారతీయ జనతా పార్టీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్‌బాబు అన్నారు. ఆదివార రోజున పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో 13వ బూత్ అధ్యక్షులు వరికోలు నాగరాజు ఆధ్వర్యంలో ఇంటింటికి బిజెపి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని గొప్పలు చెబుతుందని కానీ వారి రిజర్వేషన్‌ల వెనుక బీసీలకు అన్యాయం చేసే కుట్ర చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గురించి, అభివృద్ధికి సంబందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ఇందిరమ్మ పేరుతో ఇస్తున్న ఇండ్లకు మోడీ ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వార 2లక్షల 50వేల ఇండ్లు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం దానిని బయటకు రానివ్వడం లేదన్నారు. కార్యక్రమంలో బిజెపి కిసాన్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొల్లపల్లి వీరాచారి, పట్టణ ఉపాధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు రాంప్రసాద్, రాజేందర్, లక్ష్మయ్య, సాయిరాం, వరియోగుల అనంతస్వామి, సంతోష్, శ్రీనివాస్, నారాయణ, ఉన్నారు.

### ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** హుస్నాబాద్ డివిజన్ ఫోటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించారు. ఈ ఎన్నికలో డివిజన్ నూతన గౌరవ సలహాదారులుగా తాడూరి సురేష్, గూళ్ల రవికుమార్‌లను ఎన్నుకోగా నూతన డివిజన్ అధ్యక్షులుగా ముక్కెర రాజుయాదవ్, ఉపా ధ్యక్షులుగా శ్రీనివాస్‌యాదవ్, ప్రధానకార్యదర్శిగా బైరగోని రాము, కోశాధి కారిగా కొడముంజ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బోయిని సంపత్, ప్రచార కార్యదర్శిగా పచ్చిమట్ల శ్రీకాంత్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ ఫోటో గ్రాఫర్‌లతో పాటు సంఘం సభ్యులు ఉన్నారు.



అసోసియేషన్ నూతన పాలకవర్గం

# అల్లాదుర్గంలో రోడ్లు అధ్వానం..పట్టించుకోని అధికారులు



అల్లాదుర్గంలో గుంతల మయంగా మారి బిటి రోడ్డు

**అల్లాదుర్గం, ఆగస్టు 3, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గంకు వెళ్లే రోడ్లు అద్వానంగా ఉంది. గుంతలమయంగా మారిన రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారినా పట్టించుకునేవారే కరువయ్యారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పట్టణంలోని బస్టాండ్ నుంచి అల్లాదుర్గం మెట్టుగడ్డ 161 జాతీయ రహదారి వరకు గల 1 కిలో మీటరు మేర రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. చిన్న వర్షం కురిసినా గుంతల్లో వర్షపునీరు చేరుకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అల్లాదుర్గం మండల కేంద్రం, సబ్ డివిజన్ కావడంతో ఆయా గ్రామాల ప్రజలు నిత్యం పెద్ద సంఖ్యలో రావాల్సి ఉంటుంది. అల్లాదుర్గంలో ప్రసిద్దిగాంచిన రేణుకఎల్లమ్మ, వీరభద్రేశ్వర, బేతాళ స్వామి, వెంకటేశ్వరస్వామి తదితర దేవాలయాలు ఉన్నాయి. ఆలయాలను దర్శించుకునేందుకు మండల ప్రజలతోపాటు ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఆయా మండలాల నుంచి భక్తులు వస్తుంటారు. గ్రామానికి వచ్చిన భక్తులు రోడ్డు దుస్థితిని చూసి ఔరా ఇది సబ్ డివిజన్ కేంద్రమా, ఇది మండల కేంద్రమా అంటూ నోరెళ్ల బెట్టుకుంటున్నారు. అధ్వానంగా మారి రోడ్డు గుండానే నిత్యం పాలకులు, అధికారులు ప్రయాణం చేస్తూ ఉన్నా మరమ్మతులు చేయాలన్న ఆలోచన రాకపోవడం విస్మయాన్ని కల్గొస్తోంది.

సంబంధిత అధికారులు, పాలకులు ఇప్పటికైనా స్పందించి అధ్వానంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని అల్లాదుర్గం ప్రజలతో పాటు మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





ఎస్ఐని సన్మానిస్తున్న మాజీ ఎంపిపి, బహుజన్ జాగృతి నాయకులు

## కొల్చారం ఎస్ఐకి సన్మానం

**కొల్చారం, ఆగస్టు 3(ప్రభాతవార్త):** కొల్చారం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన అహ్మద్ మోహిద్దీన్‌ను మాజీ వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, బహుజన జాగృతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యోహాన్ కలిసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న క్రైమ్‌పై దృష్టి పెట్టి శాంతిని నెలకొల్పాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎలాంటి అత్యవసర సమయంలోనైనా ప్రజలు సంప్రదించవచ్చన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కార దిశగా ముందుకు నడుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తెలంగాణ వాణి మెదక్ జిల్లా కార్యదర్శి జయరాజ్,బాలరాజ్ ఉన్నారు.

**సిర్గాపూర్ ఎస్ఐకి...**



ఎస్ఐ మహేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న బిఆర్ఎస్ నేతలు

**సిర్గాపూర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** సిర్గాపూర్ పోలీసు ఠాణా ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మహేష్‌కుమర్‌ను ఆదివారం బిఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. మండలం ప్రశాంతంగా ఉండేందుకు తమ వంతుగా సహకరిస్తామని జమ్ముల తండా మాజీ సర్పంచ్ దివ్యభారతి చరణ్ నాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సంజీవరావు, సిర్గాపూర్ మాజీ ఎంపిటిసి సభ్యులు రాజ్‌కుమార్, సంగం మాజీ సర్పంచ్ రవికుమార్‌రావు, సిర్గాపూర్ బిఆర్ఎస్ పార్టీ యువత అధ్యక్షులు సర్వాగౌడ్, రవీందర్‌రెడ్డి, యూత్ బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పండరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మైకోడ్‌లో గ్రామ సుభిక్షానికి హోమాలు

**మనూర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** గ్రామం సుభిక్షాన్ని కాంకిస్తూ వివేకానంద సేవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. గ్రామ సుభిక్షాన్ని కోరుకుంటూ ప్రతి మాసం మొదటి ఆదివారం హోమాలు, పూజా కార్యక్రమాలు ఆనవాయితీగా నిర్వహిస్తూ వస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రామంలోని ఆలయంలో యజ్ఞాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ(అన్నదానం) నిర్వహించిన గ్రామానికి చెందిన ఎల్లోయి అనిల్ దంపతులు హోమాల్లో పాల్గొని అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి బాధ్యులు, పాల్గొన్నారు.

## వంట సామాగ్రి అందజేత

**నారాయణఖేడ్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** కరీంనగర్ జిల్లా కొడిమ్యాల వాస్తవ్యులు సామల మునిస్వామి మల్లేశ్వరిల కుమారుడు నారాయణఖేడ్ పట్టణంలో వైద్య విభాగంలో ప్రజలకు మంచి సేవలు అందిస్తున్న సామల శ్రీనివాస్ సునీత పుణ్య దంపతుల కూతురు రిషిక, కొడుకు మునిశ్వర్‌లు నారాయణఖేడ్ పట్టణంలోని అత్యంత మహిమాన్వికమైన బ్రహ్మ సూత్ర శివ లింగ శ్రీభక్త మార్కండేయ ఆలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి కావలసిన వంట సామాగ్రిని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు వారు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో భాగంగా వంటసామగ్రి అందించిన శ్రీనివాస్, సునీత దంపతులకు వారి కుటుంబ సభ్యులకి శ్రీ చంద్రమౌళీశ్వర కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఇదేవిధంగా భక్తులు తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం అందించి ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు.

## విశ్వశాంతికై మహా పాదయాత్ర

**సదాశివపేట, ఆగస్టు 3(ప్రభాతవార్త):** దేశం బాగుండాలని వీరభద్రుడిని తలుచుకుంటూ ఆదివారం మహా పాదయాత్ర ప్రారంభించారు. పటాన్‌చెరులోని ఉమామహేశ్వర దేవాలయం నుండి ప్రారంభమైన ఈ మహా పాదయాత్రలో సుమారు 1500 మంది పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా నాయకులు అనిమిశెట్టి జయప్రకాష్,పట్లోళ్ల చంద్రశేఖర్, సదాశివపేట నాయకులు గంధిగె రాజు గుణాకర్ శంకరప్ప అశోక్ సుధాకర్ ప్రశాంత్ మరియు సమాజం సభ్యులు ఈ మహా పాదయాత్రలో పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**కొండాపూర్, ఆగస్టు 3(ప్రభాతవార్త):** మండలంలోని అనంతసాగర్ గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ రఘునాథ్‌రెడ్డి తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం వారి కుటుంబాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. తేర్పోల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త బోయినీ ప్రసాద్ అకాల మరణం పట్ల వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు మ్యాకం విఠల్, జనరల్ సెక్రటరీ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు ఇంద్రారెడ్డి, వహీద్, కిరణ్, జాలీల్, రాములు, భూపాల్‌గౌడ్, అజీమ్, కుమార్, శ్రీశైలం అజీమ్, నర్సింలు, సంగమేశ్వర్, తేర్పోల్‌లో మాజీ ఎంపీటీసీ మోహన్‌గౌడ్, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ శేఖర్, కిష్టరెడ్డి, హరిదాస్‌పూర్ మాజీ సర్పంచ్ షాపి, మమ్మద్, డి నారాయణ, ఏ ప్రభు ఉన్నారు.

### పేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత

**కల్హేర్, ఆగస్టు 3,ప్రభాతవార్త :** కల్హేర్ మండల మార్డి గ్రామానికి చెందిన జోగు అంజమ్మ ఆర్థికంగా ఎంతో ఇబ్బందులలో ఉండడంతో విషయం తెలుసుకున్న జీఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ గుర్రపు మచ్చేందర్ సూచన మేరకు సభ్యులు వారికి రెండు నెలలకు సరిపడు నిత్యావసర సరుకులు అందజేసి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ ఫౌండేషన్ సభ్యులు గుర్రపు శ్రీనివాస్, గుర్రపు బాలరాజ్, గుర్రపు నర్సింలు, హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ సాగర్, సాలె నర్సింలు, కురుమ లక్ష్మణ్, రాజు, సుందర్ తదితరులు ఉన్నారు.

### సానీక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీల్‌చేర్ పంపిణీ

**చిన్నశంకరంపేట, ఆగస్టు 3,ప్రభాతవార్త:** మండల పరిధి గజగట్లపల్లి గ్రామానికి చెందిన వృద్దురాలు ముంద్రాతి లక్ష్మీ, భర్త శివరాజ్య ఇటీవల పెరాలసిస్ వ్యాధి బారిన పడటంతో మంచానికి పరిమితమయ్యారు. ఇంకొకరి సహాయం లేనిదే ఎలాంటి పనులు చేసుకోలేని దుస్థితి వారిది. విషయం తెలుసుకున్న సానీక్ష ఫౌండేషన్ చైర్మన్ డా. శివనాయక్, వీ కెన్ మేక్ ఏ చేంజ్ టీం అధ్యక్షుడు భార్గవ్ ఆర్యన్ సహకారంతో వృద్దురాలికి వీల్‌చైర్‌ను అందించారు. భవిష్యత్తులో అన్ని విధాలుగా కుటుంబానికి సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అశోక్, పృథ్వీరాజ్, సురేష్‌గౌడ్, నర్సింలు, సాయిబాబు, సత్యం, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

**నారాయణఖేడ్, ఆగస్టు 3, ప్రభాతవార్త :** మండల పరిధిలోని జగన్నాథపూర్ వద్ద ఆదివారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురెదురుగా వచ్చిన ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో మెత్రి నాగేష్, తోర్నల్ నర్సింలులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన జరిగిన సమయంలో ఆ దారిన వెళుతున్న పోతుల మహిపాల్‌రెడ్డి తన వాహనంలోనే బాధితులను నారాయణఖేడ్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.